సంపుటి : 9
సంచిక : 336
శుక్రవారం
28 ఆగస్టు 2026
పేజీలు : 12
వెల : 2/-

విశ్వం వాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

E-PAPER

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE

Contact For Ads:
7579339999

అర్ధ శతాబ్దపు

సుదీర్ఘప్రయాణం

50వ ఏట అడుగుపెట్టిన 'రాయలసీమ ఎక్స్‌ప్రెస్'

రాయలసీమ, ఆగస్టు 27, విశ్వం వాయిస్ న్యూస్ : దక్షిణ మధ్య రైల్వేలో అత్యంత ప్రజాదరణ పొందిన రాయలసీమ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఒక అరుదైన, చారిత్రాత్మక మైలురాయిని చేరుకుంది. 49 ఏళ్ల సుదీర్ఘ సేవలను విజయవంతంగా పూర్తి చేసుకుని, ఈ రైలు ఇప్పుడు 50వ సంవత్సరం (అర్ధ శతాబ్దం)లోకి అడుగు పెట్టింది. 1977లో మీటర్ గేజ్ పట్టాలపై అత్యంత సాధారణ సర్వీసుగా ప్రయాణాన్ని ప్రారంభించిన ఈ రైలు ఐదు పదుల కాలంలో పేద, మధ్యతరగతి ప్రజలకు అత్యంత నమ్మకమైన 'పేదల బండి'గా నిలిచింది. కాలక్రమేణా ప్రయాణికుల నుంచి వచ్చిన భారీ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ ఈ రైలును హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వరకు పొడిగించింది. అంతేకాకుండా మిగతా .. 2లో..

నేపాల్ వరదల్లో చిక్కుకున్న తెలుగు రాష్ట్రాల యాత్రికులు

నేపాల్ వరదలు.. ఏపీ, తెలంగాణకు చెందిన 29 మంది గల్లంతు
ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు, తెలంగాణకు చెందిన 22 మంది గల్లంతు
యాత్రికుల భద్రతపై చంద్రబాబు, రేవంత్ రెడ్డి సమీక్షలు
బాధితుల సహాయం కోసం ఢిల్లీలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు
కేంద్ర ప్రభుత్వం, రాయబార కార్యాలయాలతో సమన్వయం

ఆగస్టు 27, విశ్వం వాయిస్ న్యూస్ : నేపాల్‌ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు కైలాస మానస సరోవర యాత్రకు వెళ్లిన తెలుగు రాష్ట్రాల యాత్రికులను తీవ్ర కష్టాల్లోకి నెట్టాయి. ఈ విపత్తు కారణంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు, తెలంగాణకు చెందిన 22 మందితో సహా మొత్తం 29 మంది ఆచూకీ ఇంకా లభించలేదని అధికారులు గురువారం తెలిపారు. వీరిని సురక్షితంగా వెనక్కి తీసుకురావడానికి ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు యాత్రికుల ఆచూకీ తెలియరాలేదని, మరో 34 మంది సురక్షితంగా ఉన్నారని అధికారులు వెల్లడించారు. కర్నూలు–ఆదోనికి చెందిన నలుగురు టిబెట్‌లో క్షేమంగా ఉండగా, తిరుపతి ప్రాంతానికి చెందిన 28 మంది యాత్రికులు ఖాట్మండులో సురక్షితంగా ఉన్నట్లు రియల్-టైమ్ గవర్నెన్స్ సొసైటీ ద్వారా సంప్రదించి నిర్ధారించుకున్నారు. గల్లంతైన ఏడుగురిలో చిత్తూరు, విజయవాడ, కాకినాడ, గుంటూరుకు చెందిన వారున్నారు. వీరిలో ముగ్గురు ఈశా ఫౌండేషన్ నిర్వహించిన యాత్రలో పాల్గొన్నారని, వారి ఫోన్లు స్విచ్ ఆఫ్ వస్తున్నాయని తెలిపారు. ఈ పరిణామాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా తీసుకురావడమే ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. బాధితుల వివరాలు మిగతా .. 2లో..

మంగళగిరిలో

మోడరన్ రైతు బజార్

శంకుస్థాపన చేసిన మంత్రి లోకేశ్
రూ.18.55 కోట్ల వ్యయంతో 5.90 ఎకరాల్లో మార్కెట్ నిర్మాణం
అరబిందో ఫార్మా ట్రస్ట్ సీఎస్ఆర్ నిధులతో ఈ ప్రాజెక్టుకు శ్రీకారం

మంగళగిరి, ఆగస్టు 27, విశ్వం వాయిస్ న్యూస్ : మంగళగిరిని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మరో కీలక ముందడుగు వేశారు. మంగళగిరి పట్టణంలోని నిడమర్రు రైల్వే గేట్ సమీపంలో రూ.18.55 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న అత్యాధునిక 'మోడరన్ రైతు బజార్' నిర్మాణ పనులకు ఆయన గురువారం భూమిపూజ చేసి, శంకుస్థాపన చేశారు. సుమారు 5.90 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఇంటిగ్రేటెడ్ మిగతా .. 2లో..

యుద్ధ ట్యాంకులు.. సరిహద్దుల్లో ఉక్కు గోడల్లాంటివి

రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

ఆగస్టు 27, విశ్వం వాయిస్ న్యూస్ : యుద్ధ ట్యాంకులు దేశ సరిహద్దుల్లో ఉక్కు గోడల్లాంటివని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. డ్రోన్లు, క్షిపణుల పాత్ర పెరుగుతున్నప్పటికీ.. భూతల దాడుల్లో యుద్ధ ట్యాంకులు కీలకమని తెలిపారు. అవి శత్రువుల పాలిట సింహస్వప్నంలా మిగతా .. 2లో..

జగన్ హయాంలో

సాగునీటి ప్రాజెక్టుల ధ్వంసం

మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి, ఆగస్టు 27, విశ్వం వాయిస్ న్యూస్ : వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని ఇరిగేషన్ ప్రాజెక్టులను సర్వనాశనం చేశారని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ పోలవరం పనులను నిర్లక్ష్యం చేయకుండా కొనసాగించి ఉంటే రాష్ట్రంలో ఎల్ నినో పరిస్థితులు వచ్చినా రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదని వ్యాఖ్యానించారు. టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హంద్రీనీవా ప్రాజెక్టుపై 16 నెలల్లోనే రూ.3,500 కోట్లు ఖర్చు చేసి కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు సాగునీరు అందించామని అచ్చెన్నాయుడు తెలిపారు. గతంలో 74 శాతం మేర పూర్తయిన మిగతా .. 2లో..

రాజకీయాల్లోకి జెన్ జీ..

ఇగో వీడి యువతను కలుపుకుపోవాలి

ప్రామాణికత, భాగస్వామ్యం కోరుకుంటున్న జెన్ జీ యువత - నియోజకవర్గాల్లో యువత, ఇన్‌ఫ్లుయెన్సర్లతో చర్చిస్తామని వెల్లడి
యువత నుంచి అద్భుతమైన ఆలోచనలు వస్తున్నాయని వ్యాఖ్య - ముంబైలో ఫార్చ్యూన్ ఇండియా అవార్డుల కార్యక్రమంలో కీలక ప్రసంగం

ముంబై, ఆగస్టు 27, విశ్వం వాయిస్ న్యూస్ : రాజకీయ పార్టీలు, నాయకులు తమ సంప్రదాయ పద్ధతులకు స్వస్తి పలికి, పాలనలో, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో యువతను క్రియాశీల భాగస్వాములను చేయాలని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. జెన్ జీ యువత ఆలోచనలకు అనుగుణంగా రాజకీయాలు మారాల్సిన అవసరం ఉందని, వారిని తక్కువ అంచనా వేయరాదని హితవు పలికారు. బుధవారం నాడు ముంబైలో జరిగిన 'ఫార్చ్యూన్ ఇండియా 40 అండర్ 40' అవార్డుల కార్యక్రమంలో లోకేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాజకీయాలు, పాలనలో యువత భాగస్వామ్యంపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "యువతరంతో నా అనుభవం ద్వారా నేను నేర్చుకున్న అతిపెద్ద పాఠం చాలా సులభమైంది. వారిని ఎప్పుడూ తక్కువ అంచనా వేయొద్దు, వారిని తక్కువ చేసి మాట్లాడొద్దు. వారిని మొత్తం మిగతా .. 2లో..

జగన్ గతంలో ఆవు కథ చెప్పేవారు..

ఇప్పుడు కోతి, పులి కథలు చెబుతున్నారు

మంత్రి కొలుసు పార్థసారథి

అమరావతి, ఆగస్టు 27, విశ్వం వాయిస్ న్యూస్ : గత రెండేళ్లుగా బెంగళూరులో సేద తీరిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు అకస్మాత్తుగా ఇప్పుడు 'ఎల్ నినో' గుర్తుకు వచ్చిందా?" అని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యలపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే, శాసనసభకు వచ్చి చర్చించాలే గానీ, సొంత మీడియా ముందు మాట్లాడటం సరికాదని హితవు పలికారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్థసారథి మాట్లాడుతూ.. బీసీలు, రైతులపై జగన్ మిగతా .. 2లో..

రవితేజ 'ఇరుముడి' సినిమాపై

విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు

అమరావతి, ఆగస్టు 27, విశ్వం వాయిస్ న్యూస్ : ప్రముఖ నటుడు రవితేజ కథానాయకుడిగా నటించిన 'ఇరుముడి' చిత్రంపై తీవ్ర వివాదం రాజుకుంది. ఈ సినిమాలో ప్రభుత్వ పాఠశాలలు, ఉపాధ్యాయులను కించపరిచేలా కొన్ని సన్నివేశాలు ఉన్నాయంటూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదు అందింది. ఏపీ ప్రాథమికోపాధ్యాయ సంఘం (ఏపీటీఏ) ఈ విషయాన్ని మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. అటు, ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బోరా గోపి మూర్తి ఇరుముడి చిత్రంలోని కొన్ని సన్నివేశాలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సినిమాలోని ఆక్షేపణీయ సన్నివేశాలను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి లోకేశ్‌కు వారు విజ్ఞప్తి చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఎమ్మెల్సీ గోపి మూర్తి మీడియా సమావేశంలో మాట్లాడుతూ సినిమాలోని అంశాలపై తీవ్ర స్థాయిలో మిగతా .. 2లో..

అమరావతిలోని వీఐటీ-ఏపీ, ఆక్టేవ్

మధ్య కీలక ఒప్పందం

ఏఐ, ఎంఎల్, సాఫ్ట్‌వేర్ రంగాల్లో విద్యార్థులకు శిక్షణ
విద్యార్థులకు నేరుగా లభించనున్న రియల్-టైమ్ అనుభవం

అమరావతి, ఆగస్టు 27, విశ్వం వాయిస్ న్యూస్ : అమరావతిలోని వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయం, ప్రముఖ సాంకేతిక సంస్థ 'ఆక్టేవ్' మధ్య రెండేళ్ల కాలపరిమితితో ఒక కీలక అవగాహన ఒప్పందం కుదిరింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ వంటి వేగంగా ఎదుగుతున్న ఆధునిక సాంకేతిక రంగాల్లో విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా ఆచరణాత్మక శిక్షణను అందించడమే ఈ భాగస్వామ్య ఒప్పందం ముఖ్య ఉద్దేశం. ఈ ఒప్పందంలో భాగంగా ఆక్టేవ్ సంస్థకు చెందిన మిగతా .. 2లో..

సీఆర్డీఏ సమావేశం..

పలు పరిపాలన అనుమతులకు ఆమోదం

అమరావతి, ఆగస్టు 27, విశ్వం వాయిస్ న్యూస్ : ఏపీ సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో 65వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ పరిపాలన అనుమతులకు ఆమోదం లభించింది. రూ.596 కోట్లతో లైబ్రరీ, కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం, రూ.1,430 కోట్లతో క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుకు అనుమతులు ఇచ్చినట్లు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ పేర్కొన్నారు. 29 గ్రామాల లేఅవుట్ రోడ్లను బీటీగా అభివృద్ధి చేసేందుకు ఆమోదం తెలిపారు. అమరావతి నుంచి మంగళగిరికి తాగునీరు అందించేందుకు అంగీకరించారు. డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్ డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌కు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్, ఐఓసీఎల్ గ్రీన్ ఎనర్జీ అభివృద్ధికి కూడా అనుమతులు ఇచ్చినట్లు మంత్రి నారాయణ వెల్లడించారు. 2026 జనవరి 6లోపు రుణాలు మిగతా .. 2లో..



మాతృభాష వికాసానికి 'సీటీఏ' కృషి అభినందనీయం

పూర్వ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు

చెన్నై (టీనగర్), ఆగస్టు 27, విశ్వం వాయిస్ న్యూస్ : పొరుగు రాష్ట్రంలో ఉంటూ మాతృభాష వికాసానికి 'చెన్నపురి తెలుగు అకాడమీ(సీటీఏ)' నిరంతరం శ్రమించడం అభినందనీయమని పూర్వ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. చెన్నై లోక్‌భవన్‌లో మిగతా .. 2లో..

గవర్నర్‌కు అస్వస్థత.. పరామర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 27, విశ్వం వాయిస్ న్యూస్ : తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అస్వస్థతకు గురయ్యారు. బుధవారం ఉదయం ఛాతిలో అసౌకర్యంగా ఉండటంతో వెంటనే హైటెక్ సిటీలోని యశోద ఆసుపత్రిలో చేరారు. అత్యవసర విభాగంలో చేర్పించిన వైద్యులు ఆయనకు పలు పరీక్షలు చేశారు. కార్డియాలజిస్టు, ఎలక్ట్రోఫిజియాలజిస్టు డాక్టర్ వరద రాజశేఖర్ బృందం గవర్నర్‌కు వైద్య పరీక్షలు నిర్వహించగా.. గుండె రక్తనాళంలో ఒక బ్లాక్ ఉన్నట్లు గుర్తించారు. దాన్ని తొలగించేందుకు స్టంట్ వేశారు. గురువారం ఆయన మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

నేపాల్ వరదల్లో చిక్కుకున్న

తెలుగు రాష్ట్రాల యాత్రికులు

ఎప్పటికప్పుడు తెలుసుకుని, వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం, ఖాట్మండు, చైనాలలోని భారత రాయబార కార్యాలయాలతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని సూచించారు. రోడ్డు, వాయు మార్గాల పునరుద్ధరణతో పాటు, అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా యాత్రికులను తరలించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సహాయక చర్యల కోసం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. తెలంగాణకు చెందిన 22 మంది యాత్రికుల ఆచూకీ ఇంకా తెలియాల్సి ఉందని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు తెలిపారు. మొదట 23 మంది గల్లంతైనట్లు భావించినా, రంగారెడ్డి జిల్లాకు చెందిన ఒక యాత్రికుడు తన కుటుంబంతో మాట్లాడటంతో అతను సురక్షితంగా ఉన్నట్లు తేలింది. గల్లంతైన వారిలో ఆరుగురు తెలంగాణకు చెందినవారు కాగా, 17 మంది తెలంగాణ మూలాలున్న ఎన్నారైలు. వీరిలో చాలామంది నేపాల్-టిబెట్ సరిహద్దులోని రసువా, రసువాగఢి, గైరాంగ్ వంటి ప్రాంతాల్లో ఉన్నట్లు చివరిసారిగా తెలిసిందని అధికారులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఢిల్లీలోని తెలంగాణ భవన్, హైదరాబాద్‌లోని సచివాలయంలో హెల్ప్‌లైన్‌లను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు దాదాపు 80-100 కాల్స్ వచ్చినట్లు తెలిపారు. తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ స్వయంగా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. కేంద్ర విదేశాంగ శాఖ, భారత రాయబార కార్యాలయాలతో సమన్వయం చేసుకుంటూ గల్లంతైన వారిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. బాధితుల కుటుంబాలు, ట్రావెల్ ఆపరేటర్ల నుంచి వచ్చిన సమాచారాన్ని ధ్రువీకరించుకుంటూ సహాయక చర్యలను వేగవంతం చేసినట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

అర్ధ శతాబ్దపు సుదీర్ఘ ప్రయాణం

సాధారణ ఎక్స్‌ప్రెస్ నుంచి సూపర్ ఫాస్ట్‌గా అప్‌గ్రేడ్ చేయడమే కాక, ఆధునిక ఎల్‌హెచ్‌బి కోచ్‌లతో పాటు శక్తివంతమైన ఇంజన్లను అమర్చారు. ప్రస్తుతం ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతి నుంచి ప్రారంభమయ్యే ఈ రైలు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల మీదుగా 890 కిలోమీటర్ల సుదీర్ఘ దూరాన్ని ప్రతిరోజూ విజయవంతంగా చేరుకుంటోంది. తరాలు మారుతున్నా, ఆధునిక సాంకేతికతతో ఎన్ని వందే భారత్, ఇతర కొత్త రైళ్లు వచ్చినా రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌కున్న క్రేజ్, ఆదరణ మాత్రం ఇసుమంతైనా తగ్గలేదు. ముఖ్యంగా వికారాబాద్ జిల్లా తాండూరుతో పాటు పలు ప్రాంతాల ప్రజలతో ఈ రైలుకు విడదీయరాని ప్రత్యేక అనుబంధం ఉంది. మూడు రాష్ట్రాల ప్రజల రవాణా అవసరాలను తీరుస్తూ, ఆత్మీయ బంధాన్ని పెనవేసుకున్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్ 50వ ఏట ప్రవేశించడంపై రైల్వే ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మోడరన్ రైతు బజార్

మార్కెట్‌ను నిర్మించనున్నారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల నుంచి ఈ ప్రాజెక్టుకు అవసరమైన ఆర్థిక సహకారాన్ని అందిస్తోంది. స్థానిక ప్రజలు, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఈ రిటైల్, హోల్ సేల్ కూరగాయల మార్కెట్ నిర్మాణానికి మంత్రి లోకేశ్ శ్రీకారం చుట్టారు. మొత్తం 71,925 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఇందులో రిటైల్ మార్కెట్ విభాగంలో కూరగాయల విక్రయాల కోసం 102 స్టాళ్లు, పండ్లు, పూల కోసం 54 స్టాళ్లను కేటాయించారు. అలాగే, హోల్ సేల్ మార్కెట్ విభాగంలో 23 దుకాణాలు, 18 అన్‌లోడింగ్ ప్లాట్‌ఫామ్‌లను ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు కోల్డ్ స్టోరేజీ, కూరగాయలు ప్రక్షాళన కేంద్రాలు, క్యాంటీన్, వాహనాల పార్కింగ్ వంటి అత్యాధునిక సదుపాయాలను ఇక్కడ కల్పించనున్నారు. శంకుస్థాపన కార్యక్రమం నిమిత్తం విచ్చేసిన మంత్రి లోకేశ్‌కు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన శిలాఫలకాన్ని ఆవిష్కరించి, మార్కెట్ నమూనాను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అరబిందో ఫార్మా ట్రస్ట్ ప్రతినిధులు, స్థానిక టీడీపీ ముఖ్య నాయకులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

యుద్ధ ట్యాంకులు.. సరిహద్దుల్లో ఉక్కు గోడల్లాంటివి

నిలుస్తాయని, యుద్ధక్షేత్రంలో సైనికుల మనోధైర్యాన్ని పెంచుతాయని చెప్పారు. మధ్యప్రదేశ్‌లోని 'వెహికల్ ఫ్యాక్టరీ జబల్‌పుర్'లో టీ-సిరీస్ యుద్ధ ట్యాంకుల మరమ్మతుల కోసం రూ.472 కోట్ల వ్యయంతో నిర్మించనున్న కేంద్రానికి శంకుస్థాపన చేసిన అనంతరం రాజ్‌నాథ్ (ుయిఅఘ్ష్ట్ర రాఅఅస్త్రష్ట్ర) ఈమేరకు ప్రసంగించారు. "అత్యంత శక్తిమంతమైన సైన్యం కలిగిన దేశాల్లో భారత్ ఒకటి. డ్రోన్లు, క్షిపణులు, ఇతర అధునాతన సాంకేతికతలతో యుద్ధం తీరు వేగంగా మారుతోంది. అంతమాత్రాన ట్యాంకులు ప్రాధాన్యం కోల్పోయాయని కాదు. రణరంగంలో ఒకే వ్యవస్థపై ఆధారపడకుండా.. సమష్టి సామర్థ్యం కలిగి ఉండటం అవసరం. డ్రోన్లు, క్షిపణులు, ఎలక్ట్రానిక్ యుద్ధ వ్యవస్థలతోపాటు ఆధునిక ట్యాంకులూ ముఖ్యమే. భూతల దాడుల్లో టీ-72, టీ-90 ట్యాంకులు ఎంతో కీలకం. దేశ సరిహద్దుల్లో అవి ఉక్కు గోడలా నిలుస్తాయి. కొత్తగా ఏర్పాటు చేయనున్న కేంద్రంలో ఏటా 80 ట్యాంకులకు మరమ్మతులు చేయొచ్చు" అని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

జగన్ హయాంలో

సాగునీటి ప్రాజెక్టుల ధ్వంసం

పోలవరం ప్రాజెక్ట్‌ను వైసీపీ ప్రభుత్వం రాగానే ఒక ఏడాది పాటు నిరంతరాయంగా పూర్తి చేసి ఉంటే ఇక్కట్లన్నీ తీరేవని, కానీ ఆ ప్రాజెక్టును గోదావరి వరదల్లో ముంచేసి నాశనం చేశారని మండిపడ్డారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం తిరిగి పోలవరాన్ని గాడిలో పెట్టిందని, వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని స్పష్టం చేశారు. అలాగే, 1995లో వెలిగొండ ప్రాజెక్టుకు చంద్రబాబు శంకుస్థాపన చేశారని... ఇప్పుడు ప్రాజెక్టును ఆయనే పూర్తి చేసి, జాతికి అంకితం చేయబోతున్నారని చెప్పారు. గతంలో తొండలు కూడా గుడ్లు పెట్టని రాతి నేలల్లో వెలిగొండను నిర్మించామని, పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలు త్వరలోనే ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని తాకబోతున్నాయని వెల్లడించారు.

జగన్ గతంలో ఆవు కథ చెప్పేవారు..

ఇప్పుడు కోతి, పులి కథలు చెబుతున్నారు

మొసలి కన్నీరు కారుస్తున్నారని, ఆయన చెప్పే అబద్ధాలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని స్పష్టం చేశారు. జగన్ ఇదివరకు ఆవు కథ చెప్పేవారు, ఇప్పుడు కోతి, పులి కథలు చెబుతున్నారు అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. గత ఐదేళ్ల పాలనలో కనీసం ఒక్క కరవు నివారణ చర్య కూడా చేపట్టని బలహీన ముఖ్యమంత్రి జగన్ అని పార్థసారథి విమర్శించారు. "బెంగళూరులో ఉన్న జగన్‌కు ఎల్ నినో గురించి తెలియకపోవచ్చు. కానీ ఇప్పుడు అకస్మాత్తుగా గుర్తుకు వచ్చింది. ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు కూటమి ప్రభుత్వం ముందునుంచే చర్యలు చేపట్టింది. ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులు, కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తక్కువ నీటితో అధిక దిగుబడినిచ్చే వరి వంగడాలను ప్రోత్సహిస్తున్నాం. వరి, మినుము, పత్తి వంటి పంటలకు తక్కువ ప్రీమియంతోనే బీమా చేయిస్తున్నాం" అని వివరించారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు చేసిన ద్రోహం, విధ్వంసం బయటపడుతుందనే భయంతోనే జగన్ అసెంబ్లీకి రావడం లేదని ఆరోపించారు.

మండలిలో చర్చకు ఎందుకు రాలేదు?

రైతులపై అంత ప్రేమ ఉంటే, ఎల్ నినో అంశంపై శాసనమండలిలో వైసీపీ ఎమ్మెల్సీలతో ఎందుకు చర్చకు పట్టుబట్టలేదని మంత్రి పార్థసారథి ప్రశ్నించారు. "విలువైన మండలి సమయాన్ని డిప్యూటీ ఛైర్మన్‌ను పొగడటానికే సరిపెట్టారు. నాలుగు గంటలపాటు కూటమి ప్రభుత్వంపై విషం చిమ్ముతూ, డిప్యూటీ ఛైర్మన్‌ను పొగిడేందుకు సమయాన్ని వృథా చేశారు. పత్రికా ప్రకటనలతో సానుభూతి చూపిస్తే సమస్యలు పరిష్కారం కావు" అని స్పష్టం చేశారు.

బీసీలను మోసగించిన వ్యక్తి జగన్

బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లను హైకోర్టు వ్యతిరేకిస్తే, దానిపై సుప్రీంకోర్టుకు వెళ్లి జగన్ ఎందుకు పోరాడలేదని పార్థసారథి నిలదీశారు. "జగన్ నిర్వాకం వల్ల 16,800 మంది బీసీలు పదవులు కోల్పోయారు. 1995లోనే చంద్రబాబు ప్రత్యేక చట్టం చేసి బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పించారు. నామినేటెడ్ కాంట్రాక్టుల్లో బీసీలకు 50% రిజర్వేషన్లు ఇస్తానని అసెంబ్లీ సాక్షిగా మాట తప్పిన వ్యక్తి జగన్. నేతి బీరకాయలో నెయ్యి ఎంత నిజమో, జగన్ మాటలు కూడా అంతే. బీసీలపై అంత ప్రేమ ఉంటే ఒక్క బీసీకి అయినా వైస్ ఛాన్సలర్ పదవి ఇచ్చారా? అధికారంలో ఉన్నప్పుడు బీసీల భూములు కొట్టేశారు, వారిని నరికి చంపారు. ఇప్పుడు వారిపై ప్రేమ నటిస్తున్నారు" అని తీవ్రంగా విమర్శించారు.

రాయలసీమకు చేసిందేమీ లేదు

రాయలసీమ ప్రాజెక్టులకు జగన్ తన ఐదేళ్ల పాలనలో ఖర్చు పెట్టింది కేవలం రూ. 2,000 కోట్లు మాత్రమేనని, కానీ కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే రూ. 13,500 కోట్లు ఖర్చు చేసి, మరో రూ. 10,000 కోట్లు ఖర్చు పెట్టడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. "సొంత జిల్లా కడపలో స్టీల్ ప్లాంట్‌కు రెండుసార్లు కొబ్బరికాయ కొట్టారు కానీ ఒక్క ఇటుక కూడా పేర్చలేదు. నేడు కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పోలవరం పనులను జగన్ అటకెక్కించారు. మేము అధికారంలోకి వచ్చాక పనులు పూర్తిచేసి సెప్టెంబర్ 3 నాటికి ఉత్తరాంధ్రకు నీళ్లు ఇస్తున్నాం" అని స్పష్టం చేశారు. మద్యం కేసులో అరెస్టులు కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ చేస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధిస్తోందని జగన్ దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

రాజకీయాల్లోకి జెన్ జీ..

ఇగో వీడి యువతను కలుపుకుపోవాలి

అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములను చేయాలి" అని అన్నారు. రాజకీయాల్లో యువత ప్రాధాన్యంపై ప్రస్తుత చర్చకు చాలా కాలం ముందే తాను, తమ ముఖ్యమంత్రి గారు యువతతో మమేకమవుతున్నామని లోకేశ్ గుర్తుచేశారు. తాము ఒక నియోజకవర్గానికి వెళ్లినప్పుడు, అక్కడి యువత, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లతో ప్రత్యేకంగా సమావేశమవుతామని వివరించారు. "'మేము ఇంకా మెరుగ్గా ఎలా చేయగలం?', 'ఈ నియోజకవర్గంలో విభిన్నంగా ఏం చేయొచ్చు?' అని వారిని అడుగుతాం" అని తెలిపారు. ఇలాంటి నిర్మాణాత్మక చర్చల నుంచి ఎన్నో అద్భుతమైన ఆలోచనలు పుట్టుకొస్తాయని, వాటిని కేవలం వినడమే కాకుండా, అమలు చేయడానికి తమ వద్ద ఒక పక్కా వ్యవస్థ ఉందని లోకేశ్ తెలిపారు. "యువత నుంచి వచ్చే ఆలోచనలను స్వీకరించి, వాటిని ఫాలో-అప్ చేసే విధానం మాకుంది. వారిని సంభాషణలో భాగం చేయడమే వారు కోరుకుంటున్న మొదటి విషయం అని నేను నమ్ముతున్నాను" అని ఆయన పేర్కొన్నారు. యువత సూచనలు, ఆలోచనలతో పాలనను మరింత మెరుగుపరచవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రాజకీయ నాయకులు కూడా తమ వైఖరిని మార్చుకోవాలని లోకేశ్ సూచించారు. "రాజకీయ నాయకులుగా మనం మన ఇగోని, అద్దుగోడలను వదిలేయడం చాలా ముఖ్యం. ఈ రోజుల్లో యువత మీతో భావోద్వేగ స్థాయిలో మమేకమవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. వారు మీ నుంచి కోరుకునేది కేవలం ప్రామాణికత మాత్రమే" అని అన్నారు. కల్మషం లేనితనం, పారదర్శకతే భారతదేశంలో తర్వాతి తరం రాజకీయ నాయకులకు ముఖ్యమైన లక్షణాలుగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. "భారతదేశంలో నవతరం రాజకీయ నాయకుల నుంచి యువత ఆశిస్తున్నది అదేనని నేను గట్టిగా నమ్ముతున్నాను" అని లోకేశ్ తన ప్రసంగంలో పేర్కొన్నారు.

రవితేజ 'ఇరుముడి' సినిమాపై

విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు

మండిపడ్డారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నియోజకవర్గంలోని ఓ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఈ సినిమాను చిత్రీకరించారని, కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బాలికల యూనిఫామ్‌ను సినిమాలో చూపించారని తెలిపారు. ఓ మహిళా ఉపాధ్యాయురాలిని అత్యంత క్రూరంగా, ప్రతికూల స్వభావంతో చిత్రీకరించారని ఆరోపించారు. స్పెషల్ క్లాసుల పేరుతో ఓ విద్యార్థినిని ఎమ్మెల్యే వద్దకు పంపే సన్నివేశం అత్యంత దారుణంగా ఉందని, ఇది ప్రజాప్రతినిధులపై కూడా తప్పుడు అభిప్రాయం కలిగించేలా ఉందని విమర్శించారు. పాత్రలు కల్పితమైనప్పటికీ, ప్రభుత్వ పాఠశాల వాతావరణంలో, ప్రభుత్వ యూనిఫామ్స్‌తో చిత్రీకరించడం వల్ల సమాజంలోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని గోపి మూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. సినిమా అనేది శక్తిమంతమైన మాధ్యమమని, దర్శక, నిర్మాతలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ పాఠశాలల పట్ల సామాజిక బాధ్యత ఉండాలని హితవు పలికారు. ఉపాధ్యాయులను కించపరచడం విద్యను అవమానించడమేనని, ప్రభుత్వ బడులను చులకనగా చూపడం లక్షలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్నో సవాళ్ల మధ్య పేద విద్యార్థులకు విద్యనందిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులందరినీ అవమానించేలా ఈ చిత్రీకరణ ఉందని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొన్నాయి. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెంటనే స్పందించి, సినిమా నుంచి వివాదాస్పద సన్నివేశాలను తొలగించేలా ఆదేశాలు జారీ చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

అమరావతిలోని వీఐటీ-ఏపీ, ఆక్టేవ్

మధ్య కీలక ఒప్పందం

నిపుణులైన మెంటార్లతో కలిసి విద్యార్థులు ప్రత్యక్షంగా ప్రాజెక్టులను రూపొందించనున్నారు. ప్రతి ప్రాజెక్టులోనూ ఒక ప్రొఫెసర్‌తో పాటు నలుగురు విద్యార్థులు, ఇద్దరు మెంటార్లు భాగస్వాములుగా ఉంటూ, మూడు నెలల నిర్దిష్ట వ్యవధిలో ప్రాజెక్టును పూర్తి చేసేలా ప్రణాళికను సిద్ధం చేశారు. దీనివల్ల విద్యార్థులకు రియల్-టైమ్ అనుభవం నేరుగా లభించనుంది. అంతేకాకుండా, మార్కెట్ అవసరాలకు తగినట్లుగా వీఐటీ-ఏపీలో ఏఐ, మీ పాఠ్యాంశాల రూపకల్పనకు ఆక్టేవ్ సంస్థ తగిన సూచనలు, సలహాలు అందించనుంది. విద్యార్థులలో సృజనాత్మక నైపుణ్యాలను పెంపొందించేందుకు హ్యాకథాన్‌లు నిర్వహించడంతో పాటు, వారికి ఇంటర్న్‌షిప్‌లు, ఉద్యోగ అవకాశాల కల్పనలోనూ ఇరు సంస్థలు సంయుక్తంగా వ్యవహరించనున్నాయి. సాంకేతిక రంగానికి అవసరమైన ప్రతిభావంతులైన యువతను తీర్చిదిద్దడమే ఈ అవగాహన ఒప్పందం ప్రధాన లక్ష్యమని విశ్వవిద్యాలయ నిర్వాహకులు వెల్లడించారు.

సీఆర్డీఏ సమావేశం..

తీసుకున్న రెండో దశ భూ సమీకరణ రైతులకు కూడా రుణమాఫీ వర్తింపజేసేందుకు సీఎం చంద్రబాబు అంగీకరించినట్లు తెలిపారు.

మాతృభాష వికాసానికి 'సీటీపీ' కృషి అభినందనీయం

చెన్నైపురి తెలుగు అకాడమీ ఆధ్వర్యంలో తూమాటి సంజీవరావు సంపాదకత్వంలో ప్రచురించిన 'శిష్ట, విశిష్ట తెలుగు విజయోత్సవాలు' గ్రంథాన్ని ఎం.వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమిళనాడులో నివసిస్తున్నప్పటికీ తెలుగు ప్రాచీన భాషా హోదా సాధనలో సంజీవరావు చూపిన చొరవ ప్రశంసనీయమన్నారు. 1971-73 కాలంలో 'ఆంధ్ర విశ్వకళా పరిషత్తు' ప్రచురించిన చారిత్రక 'శిష్ట వ్యవహారిక భాష' నివేదికను పునఃముద్రించడం ముదావహమన్నారు. తెలుగుకు ప్రాచీన హోదా దక్కి పదేళ్లయిన సందర్భంగా ఈ గ్రంథాన్ని తీసుకురావడం సమయోచితమని పేర్కొన్నారు. ఈ పుస్తకం యువతకు చేరువై, భాషా సంస్కృతుల పరిరక్షణకు దిక్సూచిలా నిలుస్తుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యావేత్తలు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

గవర్నర్‌కు అస్వస్థత.. పరామర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి

కోలుకోవడంతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు. అంతకుముందు గవర్నర్ ఆరోగ్యం గురించి సమాచారం తెలుసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి ఆసుపత్రికి వెళ్లి గవర్నర్‌ను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్యులతో మాట్లాడి గవర్నర్ ఆరోగ్యంపై ఆరా తీశారు. రక్తనాళంలో చిన్న బ్లాక్ ఉండటంతో స్టంట్ వేశామని, ఎలాంటి ఇబ్బంది లేదని వైద్యులు సీఎంకు వివరించారు.

అనకాపల్లి పంచధారల కొండలపై

ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

'నో మైనింగ్ జోన్'గా ప్రకటన

అనకాపల్లి, ఆగస్టు 27, విశ్వం వాయిస్ న్యూస్ : పర్యావరణ పరిరక్షణ, చారిత్రక సంపద రక్షణే ధ్యేయంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక చారిత్రాత్మక నిర్ణయాన్ని తీసుకుంది. అనకాపల్లి జిల్లాలోని ఆధ్యాత్మిక, చారిత్రక ప్రాధాన్యత కలిగిన పంచధారల కొండల ప్రాంతాన్ని అధికారికంగా 'నో మైనింగ్ జోన్'గా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ కొండల పరిసరాల్లో ఎలాంటి తవ్వకాలు, క్వారీ పనులకు ఆస్కారం లేకుండా పూర్తి నిషేధం అమలులోకి వచ్చింది. ఈ ప్రాంతంలో మైనింగ్ తవ్వకాల వల్ల జీవవైవిధ్యంతో పాటు ప్రసిద్ధ పురాతన క్షేత్రమైన శ్రీ ఉమా ధర్మలింగేశ్వర స్వామి దేవాలయానికి, అక్కడి సహజ సిద్ధమైన పుణ్యతీర్థ జలధారలకు తీవ్ర ముప్పు వాటిల్లుతోందని స్థానిక ప్రజలు, పర్యావరణవేత్తల నుంచి పెద్ద ఎత్తున అభ్యంతరాలు, ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రత్యేక విచారణకు ఆదేశించింది. తవ్వకాల వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతినడమే కాకుండా చారిత్రక కట్టడాలకు హాని జరుగుతోందని నిర్ధారించిన అధికారులు మైనింగ్ పనులను అడ్డుకున్నారు. ప్రకృతి వనరులను కాపాడడంలో భాగంగా ఆ ప్రాంతంలో గతంలో మంజూరు చేసిన సుమారు 2.153 హెక్టార్ల క్వారీ లీజు అనుమతులను ప్రభుత్వం తక్షణమే రద్దు చేసింది. కొండల సహజ రూపురేఖలు, జీవవైవిధ్యం దెబ్బతినకుండా ఉండేందుకు ప్రభుత్వం తీసుకున్న ఈ సంచలన నిర్ణయం పట్ల స్థానిక భక్తులు, పర్యావరణ ప్రేమికులు తీవ్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేపాల్ వరదల ప్రాంతాన్ని

సురక్షితంగా దాటాం

డీఆర్డీఓ మాజీ చైర్మన్ సతీశ్ రెడ్డి

ఆగస్టు 27, విశ్వం వాయిస్ న్యూస్ : నేపాల్‌లో సంభవించిన ఘోర ఆకస్మిక వరదలు ప్రపంచాన్ని కుదిపేశాయి. ఈ ఘోర విపత్తుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు అందరినీ కలచివేస్తున్నాయి. మరోవైపు నేపాల్‌లో ఉన్న డీఆర్డీఓ మాజీ చైర్మన్ జి. సతీశ్‌రెడ్డి తమ క్షేమ సమాచారాన్ని వెల్లడించారు. తాము నేపాల్‌లో పూర్తి సురక్షితంగా ఉన్నామని, ప్రస్తుతం మానససరోవర్ యాత్ర నిమిత్తం ముందుకు సాగుతున్నామని ఆయన తెలిపారు. వరద ప్రభావం తీవ్రంగా ఉన్న ప్రాంతాన్ని తాము సురక్షితంగా దాటుకుని వెళ్లామని చెప్పారు. అయితే మరోవైపు నేపాల్‌ను ముంచెత్తిన ఈ ఆకస్మిక జలప్రళయం తీవ్ర విషాదాన్ని నింపింది. విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించిన అధికారిక వివరాల ప్రకారం వరదల ఉద్ధృతికి ఇప్పటివరకు 826 మంది ఆచూకీ గల్లంతయ్యారు. అంతేకాకుండా, వరద ప్రవాహంలో దాదాపు 300 మంది వరకు భారతీయులు కొట్టుకుపోయినట్లు నేపాల్ విదేశాంగ శాఖ మంత్రి శిశిర్ ఖనాల్ ప్రకటన చేశారు. ఈ దారుణ విపత్తులో మృతుల సంఖ్య ఇప్పటికే 175కి చేరుకోగా, రెస్క్యూ బృందాలు గాలింపు చర్యలను మరింత వేగవంతం చేశాయి.

ఎడిటర్ వాయిస్

పండుగ ఏదైనా వీకెండ్ టూర్ పక్కానేనా?

జగన్ ముందస్తు రాఖీపై టీడీపీ ట్రోల్స్!

మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహనరెడ్డి రాఖీ పండుగను రెండు రోజుల ముందుగానే జరుపుకోవడం ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. శుక్రవారం రాఖీ పండుగ ఉన్నప్పటికీ, ఆ రోజు ఆయన అందుబాటులో ఉండరనే కారణంతో వైసీపీ మహిళా నేతలు బుధవారమే జగన్‌కు రాఖీ కట్టి సంబరాలు జరుపుకున్నారు. అయితే ఈ ముందస్తు వేడుకలపై అధికార తెలుగు దేశం పార్టీ (టీడీపీ) సోషల్ మీడియా వేదికగా తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది. శుక్రవారం నుంచి సోమవారం వరకు జగన్ రెడ్డి రాష్ట్రంలో ఉండరని, ఆ సమయంలో ఎలాంటి పండుగలు, జాతీయ ఉత్సవాలు అయినా మాజీ సీఎం పట్టించుకోరని ట్రోలింగ్ చేస్తోంది.

సాధారణంగా ఏ పండుగైనా, వేడుకైనా నిర్ణీత తేదీనే జరుపుకోవడం ఆనవాయితీ అంటూ చెబుతున్న టీడీపీ సోషల్ మీడియా మాజీ సీఎం వైఎస్ జగన్ ముందస్తు రాఖీ సంబరాలు చేసుకోవడాన్ని ఆక్షేపిస్తూ పోస్టుల వరద పారిస్తోంది. ప్రతి వారాంతంలో జగన్ రెడ్డి బెంగళూరు వెళ్లడం పరిపాటిగా మారిందని విమర్శలు గుప్పిస్తోంది. శుక్రవారం నాడు రాఖీ పండుగ ఉండటంతో, ఆయన ఆ రోజు తాడేపల్లిలో అందుబాటులో ఉండరని చెబుతూ మహిళా నేతలు బుధవారమే వైఎస్ జగన్‌ను కలిసి రాఖీలు కట్టాడాన్ని టీడీపీ హైలెట్ చేస్తోంది. ఈ ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ రకరకాల కామెంట్లతో మజీ సీఎంను ట్రోలింగ్ చేస్తోందని చెబుతున్నారు.

ఒక్క రాఖీ పండుగ విషయంలోనే కాకుండా గతంలో జగన్మోహనరెడ్డి వ్యవహరించిన తీరును ఎత్తిచూపుతూ టీడీపీ శ్రేణులు సోషల్ మీడియాలో విరుచుకుపడుతున్నారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సమైనా, రాఖీ పండుగైనా, లేక మరే ఇతర పండగలు శుక్రవారం నుంచి సోమవారం మధ్యలో వచ్చినా జగన్‌కు వాటితో సంబంధం ఉండదని ఎద్దేవా చేస్తున్నారు. ఆ నాలుగు రోజులు ఆయన బెంగళూరు చెక్కేస్తారని, కేవలం మంగళవారం పూట మాత్రమే తిరిగి తాడేపల్లికి వస్తారని విమర్శిస్తున్నారు. మూడు రోజులు మాత్రమే రాష్ట్రంలో గడిపి, మళ్లీ వీకెండ్ ట్రిప్‌కు వెళ్లిపోతారంటూ సోషల్ మీడియాలో సెటైర్లు పేలుస్తున్నారు.

ప్రజా సమస్యలపై పోరాడాల్సిన ప్రతిపక్ష నేత నిత్యం రాష్ట్రానికి దూరంగా బెంగళూరుకే పరిమితమవుతున్నారనే అంశాన్ని తెరపైకి తెస్తున్న టీడీపీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి లక్ష్యంగా తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది. దీంతో వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డి ముందస్తుగా జరుపుకున్న రాఖీ పండుగ ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

క్రైమ్ వాయిస్

మార్కాపురంలో దారుణం..

హత్య చేసి పాలంలో పాతిపెట్టిన మహిళ

అర్ధవీడు, విశ్వం వాయిస్ న్యూస్ : మార్కాపురం జిల్లాలోని అర్ధవీడు మండల కేంద్రంలో మహిళ అదృశ్యం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వమని అడగడంతో ఓ మహిళ మరో మహిళను హత్య చేసింది. వివరాల్లోకి వెళ్తే.. పెద్దారవీడు మండలం ప్రగల్లపాడు గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి (32) అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు జులై 21న పెద్దారవీడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదృశ్యం కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఆదిలక్ష్మి మరో మహిళకు అధిక వడ్డీకి రూ.50 లక్షలు ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. ఆ దిశగా దర్యాప్తు చేపట్టగా హత్య విషయం వెలుగులోకి వచ్చింది. తనకు ఇచ్చిన డబ్బును తిరిగి ఇవ్వమని అడగడంతోనే ఆదిలక్ష్మిని హత్య చేసినట్లు నిందితురాలు అంగీకరించినట్లు తెలుస్తోంది. తనను ఇంటికి పిలిపించుకొని హత్య చేసి.. ప్లాస్టిక్ డబ్బాలో పెట్టి.. పొలంలో పాతిపెట్టినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితురాలు ఇచ్చిన సమాచారంతో మహిళను పాతిపెట్టిన పొలం పరిసరాలను కంభం సీఐ మల్లికార్జున, అర్ధవీడు ఎస్సై నాంచారయ్య, పోలీసు సిబ్బంది పరిశీలించారు. నిందితురాలితో పాటు ఆమె కుమారుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. క్లూస్ టీమ్, ఫోరెన్సిక్ బృందం సాయంతో మృతదేహాన్ని బయటకు తీసేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు.

బాలికను వివస్త్రను చేసి పూజలు

ఆరు నెలలుగా నరకం చూపించిన దుర్మార్గులు – నిందితులపై పోక్సో కేసు నమోదు

అనంత నేరవార్తలు, విశ్వం వాయిస్ న్యూస్ : బాలికను వివస్త్రను చేసి పూజలో కూర్చోబెట్టి కొందరు లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై వైఎస్సార్ కడప జిల్లాలో నమోదైన కేసు.. అనంతపురం వన్‌టౌన్‌కు బదిలీ అయింది. వివరాలిలా.. అనంతపురం జిల్లాకు చెందిన వ్యక్తి ఉపాధి నిమిత్తం కుటుంబంతో అనంతపురం నగరానికి వచ్చాడు. వీరి కుటుంబానికి స్థానికంగా మహాలక్ష్మి అనే మహిళ పరిచయమైంది. హోటల్ వ్యాపారం వల్ల ఏం లాభం.. త్వరగా సంపన్నులయ్యే చిట్కా చెబుతానంది. మీ కుమార్తెను వివస్త్రగా ఓ పూజలో కూర్చోబెడితే డబ్బు, ఐశ్వర్యం కలిసి వస్తాయని నమ్మబలికింది. తొలుత అంగీకరించకున్నా.. తర్వాత ఆమె మాటలకు సరేనన్నారు. హేమంత్ అనే వ్యక్తిని పూజకు పిలిపించారు. అతడు బాలికను ఓ రహస్య ప్రదేశంలోకి తీసుకెళ్లి వివస్త్రను చేసి, అసభ్యకరంగా తాకుతూ పూజలు చేశాడు. పూజ ఫలించలేదని మరోసారి చేస్తామని.. ఆరునెలల తర్వాత (ఆగస్టు 8న) హేమంత్‌తోపాటు అతని కుమారుడు బాలసుబ్రహ్మణ్యం, విజయ్‌కుమార్ వచ్చారు. మళ్లీ అలాగే పూజ చేశారు. ఈసారీ పూజ సరిగా జరగలేదని చెప్పారు.

కడపకు తీసుకెళ్లి..

ఈ నెల 9న బాలిక, ఆమె తల్లిని వారు కడపకు తీసుకెళ్లారు. అక్కడ వెంకటేశ్‌యాదవ్ అనే దొంగ గురువు మరోసారి ఇలాగే పూజలో బాలికను చిత్రహింసలకు గురిచేశాడు. అనంతరం తల్లీకుమార్తెలను భాగ్యలక్ష్మి అనే మహిళ ఇంట్లో ఉంచారు. ఈ నెల 11న మళ్లీ పూజ చేయాలని బాలికను నిందితులు కారులో ఎక్కించుకుని వెళ్లారు. స్థానికులు గమనించి అనుమానంతో పోలీసులకు ఫిర్యాదుచేశారు. విషయం నిందితులకు తెలిసి తల్లీకుమార్తెలను కారునుంచి దింపేసి పరారయ్యారు. బాధితులు వల్లూరు పోలీసులకు ఫిర్యాదుచేయగా జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి బుధవారం అనంతపురం వన్‌టౌన్‌కు బదిలీ చేశారు. మహాలక్ష్మి, హేమంత్, బాలసుబ్రహ్మణ్యం, వెంకటేశ్‌యాదవ్‌పై పోక్సో కేసు నమోదుచేశారు.

మణుగూరులో యువకుల మధ్య ఘర్షణ.. ఒకరి మృతి

మణుగూరు, విశ్వం వాయిస్ న్యూస్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో యువకుల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలో శివకుమార్ అనే యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. శివకుమార్ హైదరాబాద్‌లో ఇంటీరియర్ కాంట్రాక్ట్ పనులు చేస్తున్నాడు. అతని దగ్గర పని చేసే యువకుడికి, మరో యువకుడికి మధ్య వివాదం ఏర్పడింది. దీంతో శివకుమార్ జోక్యం చేసుకోవటంతో వివాదం పెరిగింది. చరవాణిలో శివకుమార్‌తో యువకులు గొడవపడి మణుగూరు రమ్మని సవాల్ విసిరారు. దీంతో గురువారం మణుగూరు వెళ్లిన శివ కుమార్‌ను ఆ యువకులు 30-40 మంది గ్యాంగ్‌తో వచ్చి స్థానిక స్టోర్ గ్రౌండ్‌లో తీవ్రంగా కొట్టారు. గాయపడిన శివకుమార్‌ను ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కలహాల భారంతో కూలిన కుటుంబం

ఐదుగురు పిల్లలతో కలిసి తల్లి బలవన్మరణం

విజయపుర, విశ్వం వాయిస్ న్యూస్ : పిల్లల భవిష్యత్తు కోసం ఎన్నో కలలు కన్న తల్లే.. వారి జీవితాలకు ముగింపు పలికింది. దంపతుల మధ్య విభేదాలు ఆమెను తీవ్ర మనోవేదనకు గురిచేశాయి. చివరికి తన ఐదుగురు పిల్లలతో కలిసి చెరువులో దూకి బలవన్మరణానికి పాల్పడింది. కర్ణాటకలోని విజయపుర జిల్లాలో చోటు చేసుకున్న ఈ విషాద ఘటన వివరాలను ఎస్పీ లక్ష్మణ నింబరగి వెల్లడించారు. విజయపురలో నివసించే మల్లికార్జున భీమరాయ జాలగేరి, శోభ దంపతులకు విద్య(16), సువర్ణ(14), తిప్పరాయ గౌడేశ్(10), శానిక(7), వికాస(5) అనే ఐదుగురు పిల్లలు ఉన్నారు. మల్లికార్జున వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. తన భార్య, పిల్లలు ఆదివారం రాత్రి నుంచి కనిపించడం లేదని విజయపుర గ్రామీణ ఠాణాలో సోమవారం ఆయన ఫిర్యాదుచేశారు. వారి కోసం గాలిస్తుండగా ఆదర్శనగర ఠాణా పరిధిలోని భూతనాళ చెరువులో పిల్లలతో పాటు శోభ మృతదేహాలు బుధవారం బయటపడ్డాయి. పోలీసులు మృతదేహాలను వెలికితీసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శ్రావణ సోమవారం సందర్భంగా పూజ విషయంలో దంపతుల మధ్య ఆదివారం రాత్రి గొడవ జరిగినట్లు సమాచారం. మల్లికార్జున పొలానికి వెళ్లగానే ఇంట్లో ఉన్న నలుగురు పిల్లలను తీసుకొని శోభ విజయపుర హాస్టల్‌లో ఉంటున్న కుమారుడు తిప్పరాయ గౌడేశ్ దగ్గరికి వెళ్లింది. అక్కడి నుంచి ఆరుగురు బయటకు వెళ్లినట్లు సీసీటీవీలో నమోదైంది. మరోవైపు మల్లికార్జున మద్యం తాగొచ్చి భార్యను కొట్టేవాడని శోభ తరపు బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విశ్వం వాయిస్

అవినీతిపై - అక్షర సమరం...

VISWAMVOICE TELUGU DAILY

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు

శుక్రవారం, 28 ఆగస్టు, 2026

4

www.viswamvoice.com

సత్యం • సమగ్రం • సమూజ బాధ్యత

www.viswamvoice.com

రాత్రి వేళైనా.. ఫుల్ గి'రాఖీ!

తోబుట్టువుల అనుబంధానికి ప్రతీకగా రాఖీ పండుగ సందడి

కొనుగోలుదారులను ఆకట్టుకుంటున్న కొత్త కొత్త డిజైన్లు - ఫ్యాన్సీ రాఖీలకు ప్రత్యేక ఆదరణ.. ధరల్లోనూ తగ్గేదెలే..!

రాయవరం, ఆగస్టు, 27, విశ్వం వాయిస్ న్యూస్ : తోబుట్టువుల అనుబంధానికి ప్రత్యేకతను చాటిచెప్పే పండుగ రాఖీ పౌర్ణమి. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలకు ప్రతీకగా రాఖీని సోదరుడి చేతికి కట్టి, తమ అనుబంధం కలకాలం కొనసాగాలని కోరుకునే ఆత్మీయ పండుగ ఇది. రక్షాబంధన్గా పిలిచే ఈ పర్వదినం కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేస్తూ, ప్రేమాభిమానాలను చాటుకునే వేడుకగా ప్రతి ఏడాది ఘనంగా జరుపుకుంటారు. రాఖీ పౌర్ణమి నేపథ్యంలో రాయవరం ప్రధాన రహదారిని అనుసరించి మార్కెట్లో పండుగ సందడి నెలకొంది. పండుగ సమయం దగ్గరపడటంతో రాఖీలు కొనుగోలు చేసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో దుకాణాల వద్దకు తరలివచ్చారు. రాత్రి సమయం 9:30 అయినప్పటికీ రాఖీల దుకాణాల వద్ద జనం రద్దీ ఏమాత్రం తగ్గకపోవడంతో మార్కెట్ ప్రాంతం కళకళలాడింది. చిన్నారులను ఆకట్టుకునే కార్టూన్ రాఖీల నుంచి యువతను ఆకర్షించే ఫ్యాన్సీ రాఖీల వరకు అనేక రకాల డిజైన్లు మార్కెట్లో దర్శనమిస్తున్నాయి. ముత్యాలు, రాళ్లు, రంగురంగుల అలంకరణలతో రూపొందించిన రాఖీలకు కొనుగోలుదారుల నుంచి ప్రత్యేక ఆదరణ కనిపించింది. తమ సోదరులకు నచ్చే రాఖీలను ఎంపిక చేసుకునేందుకు అక్కాచెల్లెళ్లు ఆసక్తి చూపుతున్నారు.

ధరలు సైతం తగ్గేదెలా.!

రాఖీలకు గిరాకీ పెరిగినప్పటికీ ధరలు కూడా అదే స్థాయిలో మండిపోతున్నాయంటూ కొనుగోలుదారులు వాపోతున్నారు. సాధారణ రాఖీల నుంచి ఖరీదైన ఫ్యాన్సీ రాఖీల వరకు గతంతో పోలిస్తే ధరలు పెరిగాయని పలువురు చెబుతున్నారు. ఆకర్షణీయమైన డిజైన్లు, ప్రత్యేక అలంకరణలతో ఉన్న రాఖీలకు మరింత అధిక ధరలు పలుకుతున్నాయని అంటున్నారు. ధరలు పెరిగినా పండుగ రోజు సోదరుడికి రాఖీ కట్టాలన్న ప్రేమతో కొనుగోలుదారులు వెనుకడుగు వేయడం లేదు. దీంతో రాత్రి వేళ కూడా రాఖీ దుకాణాల వద్ద కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. పండుగకు ముందు చివరి గంటల్లో రాఖీల విక్రయాలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు భావిస్తున్నారు.

రాజమహేంద్రవరంలో ఘనంగా

కిర్లోస్కర్ గోదావరి శక్తి సంగమం-2026



గోకవరం, ఆగస్టు 27, విశ్వం వాయిస్ న్యూస్ : కిర్లోస్కర్ జనరేటర్స్ ఆధ్వర్యంలో సన్‌బీమ్, గోదావరి ఆటో పవర్ సిస్టమ్స్ సహకారంతో "కిర్లోస్కర్ గోదావరి శక్తి సంగమం-2026" కార్యక్రమాన్ని రాజమహేంద్రవరంలోని హోటల్ షెల్టన్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని గోకవరం ఎంపీపీ శ్రీమతి సుంకర శ్రీవల్లి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కీలక కస్టమర్లు, ప్రముఖ వైద్యులు, ఎలక్ట్రికల్ కన్సల్టెంట్లు, డీలర్లు, వ్యాపార భాగస్వాములు, కిర్లోస్కర్ సంస్థ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కిర్లోస్కర్ సంస్థ ప్రతినిధులు సంస్థకు సంబంధించిన నూతన ఉత్పత్తులు, ఇటీవల సాధించిన కీలక ఆర్డర్లు, ప్లాంట్ తయారీ సామర్థ్యం, విస్తృతమైన సర్వీస్ నెట్‌వర్క్ తదితర అంశాలను వివరించారు. వినియోగదారులకు నాణ్యమైన, నమ్మకమైన పవర్ సొల్యూషన్స్ అందించడమే సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గోదావరి ఆటో పవర్ సిస్టమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ వెంకట రమణ మాట్లాడుతూ డీజిల్ జనరేటర్ రంగంలో తన ప్రస్థానం, కెరీర్‌లో సాధించిన ముఖ్యమైన మైలురాళ్లను వివరించారు. తన అభివృద్ధికి తోడ్పడిన ప్రతి కస్టమర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కస్టమర్ల నమ్మకం, సహకారమే తన విజయానికి ప్రధాన బలమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కస్టమర్లు, కన్సల్టెంట్లు, వ్యాపార భాగస్వాములు, సంస్థ ప్రతినిధుల మధ్య పరస్పర సంబంధాలు మరింత బలోపేతం అయ్యాయి. గోదావరి ప్రాంతంలో పెరుగుతున్న అభివృద్ధి, మౌలిక వసతులు, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నమ్మకమైన పవర్ సొల్యూషన్స్ అందించేందుకు కిర్లోస్కర్ సంస్థ మరింత విస్తృతంగా సేవలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గోదావరి ప్రాంత అభివృద్ధికి శక్తినిచ్చే నమ్మకమైన పవర్ భాగస్వామిగా కిర్లోస్కర్ ముందుకు సాగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

క్యాన్సర్ మూలాలపై గురితప్పని అస్త్రం

- యశోదలో అత్యాధునిక జన్యు చికిత్స!
- రోగి శరీర తత్వానికి అనుగుణంగా పనిచేసే కచ్చితమైన వ్యక్తిగత వైద్యం
- హైటెక్ సిటీ ప్రాంగణంలోనే అధునాతన జన్యు విశ్లేషణ కేంద్రం ఏర్పాటు
- వేగంగా, అతి తక్కువ ఖర్చుతోనే బాధితులకు వైద్య పరీక్షల నివేదికలు
- ప్రాణాంతక వ్యాధిలో లక్షిత, రోగనిరోధక చికిత్సలతో పెరగనున్న ఆయుర్దాయం
- సామాన్యుల ముంగిటకే ప్రపంచస్థాయి అత్యుత్తమ వైద్య సేవలు
- రాజమండ్రి సమావేశంలో నూతన విధానాలను వెల్లడించిన వైద్యుడు శిఖర్ కుమార్

రాజమహేంద్రవరం, ఆగస్టు, 27, విశ్వం వాయిస్ న్యూస్ : క్యాన్సర్ మహమ్మారిని సమూలంగా నిర్మూలించే దిశగా ఆధునిక వైద్యరంగం మరో చారిత్రాత్మక ముందడుగు వేసింది. సంప్రదాయ చికిత్సా విధానాల్లో అందరికీ ఒకే రకమైన మందులు వాడటం ద్వారా రోగులు ఎదుర్కొంటున్న దుష్ప్రభావాలకు చెక్ పెడుతూ.. విప్లవాత్మక మార్పులకు నాంది పలికింది. హైటెక్ సిటీలోని యశోద ఆసుపత్రి రోగి జన్యు నిర్మాణాన్ని లోతుగా విశ్లేషించి, వ్యాధి కణాల స్వభావానికి నూటికి నూరు శాతం సరిపోయే 'అధునాతన జన్యు విశ్లేషణ' (నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్) కేంద్రాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. దీనిద్వారా ప్రాథమిక దశలోనే వ్యాధి మూలాలను గుర్తించి మరణాల రేటును కట్టడి చేసే అద్భుత అవకాశం ఏర్పడింది. ఈ చారిత్రాత్మక ఆవిష్కరణకు సంబంధించిన వివరాలను రాజమండ్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్యాన్సర్ వైద్య నిపుణుడు శిఖర్ కుమార్ వెల్లడించారు. ఆధునిక వైద్యం కచ్చితమైన జన్యు ఆధారిత విధానం వైపు వేగంగా అడుగులు వేస్తోందని ఆయన స్పష్టం చేశారు. గతంలో వ్యాధి కణాలతో పాటు ఆరోగ్యకరమైన కణాలను సైతం దెబ్బతీసే రసాయన చికిత్సల (కీమోథెరపీ) స్థానంలో, ఇప్పుడు కేవలం వ్యాధి కణాలనే లక్ష్యంగా చేసుకుని అంతం చేసే అత్యుత్తమ విధానాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ముఖ్యంగా లక్షిత ఔషధాలు, రోగి సొంత రోగనిరోధక వ్యవస్థను మేల్కొలిపే నూతన చికిత్సలతో బాధితుల జీవితకాలం, జీవన ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడుతున్నాయని విశ్లేషించారు. ఆసుపత్రి ప్రాంగణంలోనే ఈ జన్యు విశ్లేషణ కేంద్రాన్ని నెలకొల్పడం వల్ల బాధితులకు ఎంతో మేలు జరగనుంది. బయటి ల్యాబ్‌ల ప్రమేయం లేకుండా అతి తక్కువ ఖర్చుతోనే, అత్యంత వేగంగా నివేదికలు అందుతాయి. సమయం ఎంతో కీలకమైన ఊపిరితిత్తులు, రొమ్ము, జీర్ణాశయ తదితర సంక్లిష్ట వ్యాధుల్లో తక్షణ నిర్ణయాలు తీసుకుని ప్రాణాలు నిలబెట్టేందుకు ఈ స్వదేశీ వ్యవస్థ ఆయుధంలా పనిచేస్తుంది. శరీరంలోని జన్యు మార్పులను కచ్చితంగా గుర్తించి ఏ మందు పనిచేస్తుందో ముందే నిర్ధారించుకుని చికిత్సను ప్రారంభిస్తారు. సంపన్నులకే పరిమితమైన ఈ అత్యాధునిక వైద్యాన్ని సామాన్యులకు సైతం చేరువ చేయడమే లక్ష్యంగా యశోద యాజమాన్యం అడుగులు వేస్తోంది. అత్యుత్తమ రోబోటిక్ శస్త్రచికిత్స, అధునాతన రేడియేషన్ వ్యవస్థలతో పాటు ఈ జన్యు విశ్లేషణ సదుపాయం తోడవడంతో రోగులకు సమగ్ర వైద్య సేవలు ఒకే చోట లభిస్తున్నాయి. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ మార్కెటింగ్ ఆంకాలజీ మార్కెటింగ్ మేనేజర్ సాయి వెంకట్ మద్దు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ వి . సాయికిరణ్ పాల్గొని భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. ఈ నూతన విధానం క్యాన్సర్ రహిత సమాజానికి బలమైన పునాది వేస్తుందని వైద్య నిపుణులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

కేంద్ర పథకాల ప్రయోజనాలు అర్హులకు అందేలా చర్యలు

రాజమహేంద్రవరం, ఆగస్టు, 27, విశ్వం వాయిస్ న్యూస్ : రాజమహేంద్రవరం: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రయోజనాలు అర్హులైన లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి అధికారులను ఆదేశించారు. రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం జరిగిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. పథకాల అమలు, గత సమావేశాల నిర్ణయాలపై సమీక్షించారు. కడియం ప్రాంతంలోని పూల రైతులను రైతులుగా నమోదు చేసి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించాలని సూచించారు. పొగాకు పంటకు పంట బీమా కల్పించే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. రాబోయే పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని రాజమహేంద్రవరం, కొవ్వూరు ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, మురుగునీటి పారుదల పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి పథకాన్ని పుష్కరాల్లోగా పూర్తి చేయాలని సూచించారు. పుష్కర ఘాట్ల అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని పేర్కొన్నారు. రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో పుష్కరాల నాటికి సుమారు సగం పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని రైల్వే అధికారులను ఆదేశించారు. మహిళలకు కుట్టుపని, అందాల అలంకరణతో పాటు కంప్యూటర్, కృత్రిమ మేధస్సు వంటి ఆధునిక రంగాల్లో నైపుణ్య శిక్షణ అందించాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, వేగుళ్ల జోగేశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, సంయుక్త కలెక్టర్ వై. మేఘా స్వరూప్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏపీ కేబినెట్ విస్తరణపై ఉత్కంఠ.. హోంశాఖ ఎవరికి?

ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం రెండేళ్ళ పాలనను పూర్తి చేసుకుంది. స్థానిక సంస్థల ఎన్నికలను ఈ అక్టోబర్ లోగా నిర్వహించాలని చూస్తోంది. ఆ తరువాత అన్నీ సమీక్షించుకుని మంత్రుల పనితీరుని స్థానిక ఫలితాల తరువాత మరోమారు బేరీజు వేసుకుని పూర్తి స్థాయిలో రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణ ఉంటుందని ప్రచారం సాగుతోంది. ఇక కేంద్ర మంత్రి వర్గ విస్తరణతో కూడా ఏపీ మంత్రి వర్గ విస్తరణ ముడిపడి ఉందని అంటున్నారు. కేంద్రంలో కొత్తగా ఎవరికి చాన్స్ ఇస్తున్నారు. ఎంత మందికి చాన్స్ వస్తుంది, ఏ ప్రాంతం, సామాజిక రాజకీయ సమీకరణలను కూడా కూలంకషంగా పరిశీలించుకుని ఏపీలో సమగ్రమైన తీరులో మంత్రి వర్గ విస్తరణ ఉంటుందని అంటున్నారు. ఏపీలో చూస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు కాకుండా ఇరవై నాలుగు మంది మంత్రులు ఉన్నారు. ఒక కేబినెట్ బెర్త్ ఖాళీగా ఉంది.

కొత్త వారికి అవకాశంతో :

చంద్రబాబు నాలుగవ సారి 2024 జూన్ 12న ఏపీ సీఎం గా బాధ్యతలు స్వీకరించారు. బాబు కేబినెట్ లో ఎపుడూ సీనియర్లు మంత్రులుగా కనిపించేవారు. ఈసారి దానికి భిన్నంగా ఎక్కువ మంది కొత్త వారికి చాన్స్ ఇచ్చారు. మొదటి సారి గెలిచి వచ్చిన వారికి కూడా మంత్రి వర్గంలో చోటు దక్కడం అంటే మామూలు విషయం కాదు. కానీ యువతరానికి పెద్ద పీట వేయాలని అలా నిర్ణయం తీసుకున్నారు. దాంతో పాటుగా సీనియర్లు కొంతమందిని జత చేర్చారు. అయితే ఇరవై నాలుగు మంత్రి మంత్రులలో ఎంత మంది సంతృప్తి స్థాయిలో పనిచేస్తున్నారు అన్నది కూడా కూటమి పెద్దల వద్ద నివేదికలు ఉన్నాయని అంటున్నారు. శాఖల వారీగా మంత్రుల పనితీరుని ఎప్పటికప్పుడు మధింపు చేస్తూ ర్యాంకులను కూడా చంద్రబాబు ఇస్తున్నారు. కొందరి పనితీరుని మార్చుకోమని కూడా కోరుతున్నారు. అయినా సరే ఆశించిన స్థాయిలో మార్పు రాలేదన్నది అయితే ఉంది. అయితే ఇపుడు స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నాయి. అందుకే విస్తరణ వంటి తేనెతుట్టెను కదపడం లేదని అంటున్నారు. వ్యూహాత్మకంగానే విస్తరణను మరిన్నాళ్ళకు వెనక్కి నెట్టారని అంటున్నారు.

లా అండ్ ఆర్డర్ మీదనే :

ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మిగిలిన శాఖల తీరు ఎలా ఉన్నా లా అండ్ ఆర్డర్ విషయంలో సమస్యలు వస్తున్నాయని అంటున్నారు. అనేక సంఘటనలు జరుగుతున్నాయి కానీ నియంత్రించే విధంగా హోం మంత్రి పని తీరు లేదన్న విమర్శలు ఉన్నాయి. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అయితే కొన్ని సందర్భాలలో బాహాటంగానే హోం శాఖ పనితీరు మీద విమర్శలు చేశారు. ఇక తాజాగా చంద్రబాబు అయితే ఏకంగా స్టేషన్ లో ఉన్న ఎస్పై స్థాయి అధికారి నుంచి రాష్ట్ర డీజీపీ వరకూ మొత్తం అధికారులతో లా అండ్ ఆర్డర్ మీద సుదీర్ఘమైన సమీక్షను నిర్వహించారు. ఇది ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ఫోకస్ పెట్టి సీరియస్ గానే వ్యవహరించారు అని చెప్పడానికి ఉదాహరణ అని అంటున్నారు. మరో వైపు విపక్షానికి కీలకమైన హోం శాఖ వంటి వాటి ద్వారానే ఆస్త్రాలు అందుతున్నాయన్న చర్చ కూడా కూటమిలో ఉందని అంటున్నారు.

విశ్వం వాయిస్
VISWAMVOICE TELUGU DAILY
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్
శుక్రవారం, 28 ఆగస్టు 2026
www.viswamvoice.com

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

పీఎంపీ నూతన కమిటీ ఏర్పాటు

ద్రాక్షారామం, ఆగస్టు 27, విశ్వం వాయిస్ న్యూస్ : నిబద్ధతతో చేసే సేవలే గుర్తింపునిస్తాయని పీఎంపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు అన్నారు. స్థానిక తోటపేట మేర్నేడి కన్వెన్షన్ హాల్ లో గురువారం కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా సర్వసభ్య సమావేశం, కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. రాష్ట్ర అధ్యక్షులు, ఎన్నికల పరిశీలకులు తోరాటి ప్రభాకరరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వీబీటీ రాజు మాట్లాడుతూ.. పల్లెల్లో ప్రాథమికంగా సేవలందిస్తున్న పీఎంపీలు సంఘ నియమ నిబంధనలను అతిక్రమించకుండా నిబద్ధతతో వైద్య సేవలందించినప్పుడే ప్రజా వైద్యులుగా గుర్తింపు పొందుతారని స్పష్టం చేశారు. నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ ఆరోగ్య, సామాజిక సమస్యల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడంలో ముందుండాలని సూచించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు మాట్లాడుతూ మండల స్థాయిలో సభ్యులకు ఎప్పటికప్పుడు వైద్య, ఆరోగ్య అవగాహన సదస్సులు ఏర్పాటు చేసుకుని అవగాహనతో కూడిన వైద్య సేవలందించాలని తెలిపారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో కోనసీమ జిల్లాతో పాటు రామచంద్రపురం మండలానికి అధ్యక్షుడిగా కొప్పిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా మరియు కె.గంగవరం మండల కార్యదర్శిగా పున్నం రాము, జిల్లా కోశాధికారిగా మరియు రామచంద్రపురం మండల కార్యదర్శిగా మట్టా వీరబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే రామచంద్రపురం మండల కోశాధికారిగా వాడపర్తి శ్రీనివాస్, కె.గంగవరం మండల అధ్యక్షుడిగా మేడిశెట్టి రామకృష్ణ, కోశాధికారిగా సూదికొండ సుబ్రహ్మణ్యంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నూతన కమిటీలను జాతీయ ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు, రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు, రాష్ట్ర మీడియా కన్వీనర్ బళ్ళా శ్రీనివాసరావు, కోనసీమ జిల్లా మాజీ అధ్యక్షులు కోన సత్యనారాయణ, పశ్చిమగోదావరి జిల్లా కోశాధికారి ఎమ్. జితేంద్రలతో పాటు ఇతర సభ్యులు అభినందించారు.

ఎంపీ చొరవతో పశ్చిమ బెంగాల్ నుంచి ఏడుగురు మత్స్యకారుల

సురక్షిత స్వస్థల ప్రయాణం ప్రారంభం

అమలాపురం, ఆగస్టు 27, విశ్వం వాయిస్ న్యూస్ : అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన ఏడుగురు మత్స్యకారుల సురక్షిత రాక కోసం అమలాపురం పార్లమెంట్ సభ్యులు జి.ఎం. హరీష్ బాలయోగి వ్యక్తిగతంగా చొరవ తీసుకుని, మొత్తం వ్యవహారాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. మత్స్యకారుల ఆచూకీ లభించిన వెంటనే, పశ్చిమ బెంగాల్ మెరైన్ డీఐజీ గారితో పాటు అక్కడి ఉన్నతాధికారులు, కేంద్ర ప్రభుత్వ అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తూ, మత్స్యకారులను సురక్షితంగా పశ్చిమ బెంగాల్ నుంచి స్వస్థలమైన అమలాపురానికి తరలించే ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం ఏడుగురు మత్స్యకారులు పశ్చిమ బెంగాల్ నుంచి అమలాపురం వైపు బయలుదేరారు. వారి ప్రయాణంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా, నేరుగా స్వగ్రామాలకు చేరుకునేందుకు అమలాపురం ఎంపీ జి.ఎం.హరీష్ బాలయోగి ప్రత్యేకంగా టెంపో ట్రావెలర్ వాహనాన్ని ఏర్పాటు చేశారు. మత్స్యకారులు తమ కుటుంబ సభ్యుల వద్దకు క్షేమంగా చేరుకునే వరకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ఎంపీ హరీష్ బాలయోగి గారు స్వయంగా పర్యవేక్షిస్తూ, ప్రతి దశలో సంబంధిత అధికారులతో సమన్వయం కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా మత్స్యకారుల సురక్షిత రాక కోసం సహకరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పశ్చిమ బెంగాల్ అధికారులు మరియు ఈ సహాయక చర్యల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఎంపీ జి.ఎం. హరీష్ బాలయోగి కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రి సుభాష్ క్షేమం కోరుతూ

భీమేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

పలు గ్రామాల నుంచి ద్రాక్షారామం తరలివచ్చిన అభిమానులు
మంత్రి సుభాష్, ఆయన కుటుంబం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్ష

ద్రాక్షారామం, ఆగస్టు 27, విశ్వం వాయిస్ న్యూస్ : ప్రజా పరిపాలనలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ క్షేమం, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ పలు గ్రామాల ప్రజలు ద్రాక్షారామం శ్రీ భీమేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కడియం మండలంలోని మురమండ, మాధవరాయుడుపాలెం, గారడిపల్లి, వీరవరం, మడికి, దుళ్ల, పొట్టిలంక, దొరగారి తోట, గుబ్బలవారిపాలెం తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో మంత్రి సుభాష్ అభిమానులు ద్రాక్షారామానికి తరలివచ్చారు. మంత్రి సుభాష్ తండ్రి, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం ఆధ్వర్యంలో భీమేశ్వర స్వామి ఆలయంలో ప్రదక్షిణలు నిర్వహించి, మంత్రి సుభాష్ పేరున ప్రత్యేక పూజలు చేశారు. ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి, నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సేవలందిస్తున్న మంత్రి సుభాష్‌కు భగవంతుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, ఆయనతో పాటు కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని భక్తులు ఆకాంక్షించారు. దక్షిణ కాశీగా భావించే పవిత్ర ద్రాక్షారామం భీమేశ్వర స్వామి సన్నిధిలో తమ అభిమాన నాయకుడు మంత్రి సుభాష్ పేరున ప్రత్యేక పూజలు చేయడం ఎంతో ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. ప్రతి నెల పౌర్ణమి రోజున మంత్రి సుభాష్ క్షేమం కోరుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మేడిశెట్టి పెద్దతో పాటు ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు, మంత్రి సుభాష్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజల భద్రతే లక్ష్యం..

ద్రాక్షారామలో పోలీసుల అవగాహన

ద్రాక్షారామం, ఆగస్టు 27, విశ్వం వాయిస్ న్యూస్ : ప్రజలకు చట్టాలు, భద్రతా చర్యలు, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించేందుకు ద్రాక్షారామ పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ద్రాక్షారామ బోస్ బొమ్మ సెంటర్‌లో ఎస్ఐ ఎం.లక్ష్మణ్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ప్రజలను ఉద్దేశించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ప్రజలు నేరాలకు దూరంగా ఉండటంతో పాటు, తమ పరిసరాల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు కనిపించినా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ముఖ్యంగా యువత చెడు అలవాట్లకు, మత్తు పదార్థాలకు ఆకర్షితులు కాకుండా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పోలీసులు కోరారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం పనిచేస్తున్నారని ఎస్ఐ ఎం.లక్ష్మణ్ తెలిపారు. మహిళలు, చిన్నారుల భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపించినప్పుడు స్వయంగా చర్యలు తీసుకోకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అలాగే ప్రజలు చట్టాలను గౌరవిస్తూ పోలీసులకు సహకరించాలని, సమాజంలో నేరాల నియంత్రణకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని తెలిపారు. గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు పోలీసులతో పాటు ప్రజలు కూడా సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బోస్ బొమ్మ సెంటర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎం.లక్ష్మణ్‌తో పాటు ద్రాక్షారామ పోలీసు సిబ్బంది పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు.

హెచ్‌పీవీ వ్యాక్సిన్ పంపిణీలో 98.47% పూర్తి

మిగిలిన 5,269 మందికి 31లోగా ఇచ్చేందుకు చర్యలు - కొత్త వారి కోసం కూడా రాష్ట్రానికి 1.90 లక్షల డోసుల వ్యాక్సిన్ త్వరలో రాక
రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ వెల్లడి

అమరావతి, ఆగస్టు 27, విశ్వం వాయిస్ న్యూస్ : హెచ్ పీవీ టీకా (వ్యాక్సిన్) పంపిణీ రాష్ట్ర వ్యాప్తంగా 98.47 శాతం పూర్తయినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. గర్భాశయ ముఖద్వార (సర్వైకల్) క్యాన్సర్ బారి నుంచి సంరక్షించే చర్యల్లో భాగంగా ఈ వ్యాక్సిన్ ను 14-15 సంవత్సరాల మధ్య ఉన్న బాలికలకు ఉచితంగా అందచేస్తున్నామని చెప్పారు. స్వర్ణ గ్రామ/వార్డు లెక్కల ప్రకారం ఈ ఏడాది మార్చి నాటికి 14 ఏళ్లు వచ్చి 15 ఏళ్ల దాటని బాలికలు 3,45,377 మంది ఉండగా వీరిలో గురువారం మధ్యాహ్నం నాటికి 3,40,108 మంది (98.47%)కి వ్యాక్సిన్ ఇచ్చినట్లు వెల్లడించారు. మిగిలిన 5,269 మంది బాలికలకు ఈ నెల 31లోగా వ్యాక్సిన్ అందిస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున అవగాహన కల్పించడం ద్వారా మొదట్లో ఉన్న అపోహలు దూరం కావడంతో తమ కుమార్తెలకు వ్యాక్సిన్ వేయించేందుకు తల్లిదండ్రులు ముందుకు వచ్చారని మంత్రి పేర్కొన్నారు.

కొత్తగా 14 ఏళ్లు నిండిన బాలికల కోసం కూడా...

తొలుత ఆగస్టు చివరి నాటికి నిర్దేశించిన వారికి వ్యాక్సిన్ పంపిణీ పూర్తి చేయాలని కేంద్రం సూచించింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం 98.47% మేర పురోగతి సాధించడం విశేషం. మరోవైపు కొన్ని రాష్ట్రాల్లో వ్యాక్సిన్ పంపిణీ తక్కువగా ఉందన్న ఉద్దేశంతో డిసెంబరు 31వ తేదీ వరకు గడువు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం గురువారం సమాచారాన్ని పంపించింది. అలాగే 14 ఏళ్లు నిండిన బాలికలకు కూడా వ్యాక్సిన్ ఇచ్చేందుకు కేంద్రం ప్రభుత్వం త్వరలో 1,90,890 డోసుల వ్యాక్సిన్ ను రాష్ట్రానికి పంపించబోతుంది. 14 ఏళ్ల బాలికలు తల్లిదండ్రులతో కలిసి ఋషిఖిఅవ ఎశీయిఎ నేరుగా పీహెచ్సీ, అర్బన్ హెల్త్ సెంటర్లకు వెళ్లాలనిఅధికారులు సూచించారు. వ్యాక్సిన్ పంపిణీ పురోగతిని అనుసరించి కేంద్రం రాష్ట్రానికి తగిన ప్రాధాన్యశీ ఇస్తోంది. ఈ వ్యాక్సిన్ పంపిణీ ప్రారంభమైన అనంతరం రెండు దపాలుగా కలిపి రాష్ట్రానికి 3,81,780 డోసులు రాష్ట్రానికి అందాయి. దీనికి సమర్థంగా సద్వినియోగం చేసుకోవడంలో ఆంధ్రప్రదేశ్ ముందుంది. డిసెంబరు 31 అనంతరం హెచ్పీవీ వ్యాక్సిన్ పంపిణీని రొటీన్ ఇమ్యునైజేషన్ కార్యక్రమంలో జతచేస్తారు.

రియాక్షన్ కేసులు లేవు: కమీషనర్ చక్రధర్ బాబు

వ్యాక్సిన్ పొందిన 3.40 లక్షల మంది బాలికలకు సంబంధించి ఎటువంటి రియాక్షన్ కేసులు నమోదు కాలేదని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ చక్రధర్ బాబు తెలిపారు. " గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ ను నివారించడంలో హెచ్ పీవీ వ్యాక్సిన్ కీలకపాత్ర పోషిస్తోంది. ఈ వ్యాక్సిన్ అత్యంత ప్రభావంతమైంది. సురక్షితమైంది కూడా. టీకా ఇచ్చిన అనంతరం బాలికలను 30 నిమిషాలపాటు అక్కడే వేచి ఉంటున్నారు. రాష్ట్రంలో కోల్డ్ చైన్ (వ్యాక్సిన్ భద్రపరిచే) సౌకర్యం కలిగిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వ్యాక్సిన్ అందిస్తున్నారు. గార్డాసిల్-4 క్వాడ్రివాలెంట్ హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను సింగిల్ డోస్ విధానంలో 0.5 మి.లీ. మోతాదుగా ఎడమ పైభుజంలో ఇంట్రామస్కులర్‌గా ఇస్తున్నారు" అని చక్రధర్‌బాబు వివరించారు.

జిల్లాల వారీగా టీకా సాధన

100 శాతం, అంతకంటే ఎక్కువ సాధించిన జిల్లాలు:

అనకాపల్లి (103.93%), బాపట్ల (103.54%), చిత్తూరు (102.15%), కాకినాడ (103.51%), కోనసీమ (104.12%), కృష్ణా (103.52%), కర్నూలు (100.72%), మార్కాపురం (112.64%), నంద్యాల (101.83%), ఎన్‌టీఆర్ (100.58%), పల్నాడు (103.49%), పార్వతీపురం మన్యం (101.51%), తిరుపతి (103.67%), వైఎస్సార్ (105.00%).

90 నుంచి 99.99 శాతం సాధించిన జిల్లాలు:

అనంతపురము (94.57%), అన్నమయ్య (95.81%), తూర్పు గోదావరి (99.52%), ఏలూరు (94.30%), ప్రకాశం (96.45%), శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు (95.22%), శ్రీ సత్యసాయి (96.37%), శ్రీకాకుళం (98.12%), విశాఖపట్నం (92.31%), విజయనగరం (98.84%), పశ్చిమ గోదావరి (99.19%).

90 శాతం కంటే తక్కువ సాధించిన జిల్లాలు:

అల్లూరి సీతారామరాజు (54.51%), గుంటూరు (87.20%), పోలవరం (73.68%).

48వ జాబ్ మేళాలో 23 మందికి ఉద్యోగాలు

రామచంద్రపురం, ఆగస్టు 27, విశ్వం వాయిస్ న్యూస్ : రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రామచంద్రపురం నియోజకవర్గంలో నిరుద్యోగ నిర్మూలన లక్ష్యంగా ప్రతి వారం నిర్వహిస్తున్న జాబ్ మేళాలు యువతకు ఉపాధి అవకాశాలను కల్పిస్తూ విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో రామచంద్రపురం ఉపాధి భవన్‌లో గురువారం నిర్వహించిన 48వ జాబ్ మేళాలో మొత్తం 23 మంది అభ్యర్థులు వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇంటర్వ్యూల అనంతరం ఫాక్స్ కాన్ కు కంపెనీకి 10 మంది, కియా 4, ఓరియంట్ 5, పెట్టి ఇంజనీరింగ్ 2, హీరో కంపెనీకి 3 ఎంపికయ్యారు. కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధి స్నేహ ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ నిర్వహించబడింది. ఎంపికైన అభ్యర్థులకు హెచ్ ఆర్ స్నేహ నియామక పత్రాలు అందజేసి అభినందించారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు తమకు ఈ అవకాశం కల్పించిన మంత్రి వాసంశెట్టి సుభాష్, వాసంశెట్టి సత్యం, ఉపాధి అధినేత రామ్ కుమార్లకు కృతజ్ఞతలు తెలిపారు.

రామచంద్రపురంలో

భర్తను హత్య చేసిన భార్య అరెస్ట్

రామచంద్రపురం, ఆగస్టు 27, విశ్వం వాయిస్ న్యూస్ : రామచంద్రపురం పిల్ల వారి వీధిలో నివాసం ఉంటున్న తంగేటి ఎల్లారావు(45) ఆగస్టు 25వ తేదీన అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అతని తమ్ముడు తంగేటి సూరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామచంద్రపురం పోలీసులు క్రైమ్ నెంబర్ 131/2026 ఖ/o 103(1) దీచీ కింద కేసు నమోదు చేశారు. ఈ కేసును రామచంద్రపురం సిఐ విచారించగా, మృతుడి భార్య తంగేటి ఉమాదేవి తన భర్తను హత్య చేసినట్లు నిర్ధారణ అయింది. హత్య చేసిన అనంతరం పరారీలో ఉన్న ఉమాదేవిని ఆగస్టు 27వ తేదీన రామచంద్రపురం సిఐ, పోలీస్ సిబ్బంది చాకచక్యంగా మండపేట టౌన్ బస్టాండ్ వద్ద అరెస్టు చేశారు. అనంతరం ఆమెను రామచంద్రపురం కోర్టులో హాజరుపరచగా, కోర్టు ఆదేశాలతో రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ మేరకు రామచంద్రపురం ఎస్ఐ ఒక ప్రకటనలో తెలిపారు.

విశ్వం వాయిస్
అవిరామ పై- అక్షరసమరం...
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

కాకినాడ
జిల్లా ఎడిషన్

శుక్రవారం, 28 ఆగస్టు 2026
www.viswamvoice.com

కేరళం నుంచే పవన్... పవర్ ఫుల్ లోకల్ వ్యూహం!

స్థానిక సంస్థల ఎన్నికలను జనసేన ఎంత పట్టుదలగా ప్రతిష్టగా తీసుకుంటోంది అన్నది అందరికీ తెలిసిందే. ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ 30 శాతం కంటే తక్కువ సీట్లలో పోటీ చేసేది లేదని జనసేన అధినాయకత్వం ఫుల్ క్లారిటీతో ఉంది. మిత్రుల మధ్య సీట్ల సర్దుబాటు 2026 లో ఉన్న బలాబలాల ఆధారంగా జరగాలని కూడా గట్టిగా కోరుతోంది. 2024 కంటే ఇపుడు తమకు ఎంతో బలం పెరిగిందని కూడా చెబుతోంది. తగ్గేది లేదన్న సందేశాన్ని బిగ్గరగానే కూటమిలో వినిపిస్తోంది. దాంతో సీట్ల సర్దుబాటు ఏ విధంగా సాగుతుంది అన్న చర్చ ఒక వైపు ఉండగానే జనసేన తన పార్టీని స్థానిక ఎన్నికల వైపు వడివడిగా నడిపిస్తోంది. ప్రస్తుతం కేరళంలో ప్రకృతి వైద్యం తీసుకుంటున్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అక్కడ నుంచే మొత్తం లోకల్ బాడీ ఎన్నికల వ్యూహాలను సిద్ధం చేస్తున్నారు.

జనసేన ఆత్మీయ సమావేశం :

ఈ నేపథ్యంలో జనసేన ఆత్మీయ సమావేశాన్ని ఈ నెల 28వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ కీలకమైన సమావేశంలో జనసేన పార్టీకి చెందిన రాష్ట్ర మంత్రులు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతోపాటు, పార్టీ నుంచి వివిధ బాధ్యతలలో ఉన్న పలు కార్పొరేషన్ చైర్మన్లు, 2019 సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీ చేసిన జనసేన అభ్యర్థులు, అలాగే 2021 స్థానిక ఎన్నికల్లో కార్పొరేటర్లుగా, కౌన్సిలర్లుగా, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలుగా పార్టీ తరఫున పోటీ చేసిన వారు ఈ కీలకమైన సమావేశంలో పాల్గొంటారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికలలో అనేక అడ్డంకులను రాజకీయ ఒత్తిళ్లను అధిగమించి కార్పొరేటర్లుగా, కౌన్సిలర్లుగా జడ్పీటీసీలుగా ఎంపీటీసీలుగా వందలమంది జనసేన నుంచి పోటీ చేసిన నేపథ్యంలో ఈ ఆత్మీయ సమావేశంలో వీరిని ఏరి కోరి మరీ భాగస్వాములను చేశారు.

పవన్ మార్గదర్శకత్వంలో :

ఇక జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావడంపై ఈ ఆత్మీయ సమావేశంలో చర్చిస్తారని చెబుతున్నారు. పవన్ అందించిన మార్గదర్శకాలు ఆయన ఇచ్చిన సూచనలను పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ వివరిస్తారని అంటున్నారు. ఈ సమావేశానికి ముందు

అదే రోజున స్థానిక ఎన్నికల విధి విధానాల కోసం 14 మంది సభ్యులతో ప్రత్యేకంగా ఏర్పాటైన కమిటీ సమావేశం కూడా జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఉంటుందని అంటున్నారు. అంటే పకడ్బందీగానే ఈ కీలక సమావేశం జరుగుతుందని అంటున్నారు. ఈ సందర్భంగా స్థానిక వ్యూహాన్ని జనసేన చర్చిస్తుందని చెబుతున్నారు.

జనసేన బలంతోనే :

జనసేనకు బలం ఉన్న చోట సీటు తీసుకోవాల్సిందే పోటీ చేయాల్సిందే అన్నది పార్టీ ఆలోచనగా ఉంది. పార్టీ విస్తరణకు పటిష్టతకు ఇంతకు మించిన చాన్స్ వేరొకటి రాదని కూడా భావిస్తున్నారు. అంతే కాదు పార్టీలో పోటీ చేసేందుకు ఎంతో మంది ఉత్సాహవంతులు సిద్ధంగా ఉన్నారని వారిలో నిలిచి గెలిచే వారికి టికెట్లు ఇస్తామని పార్టీ వర్గాలు అంటున్నారు. జనసేన పోటీ చేసే చోట్ల మిత్రులు సహకరించాలని కూడా కోరబోతున్నారు. అలాగే మిత్రులు పోటీ చేసిన చోట జనసేన నుంచి కూడా సహకారం ఉంటుందని స్పష్టంగా చెబుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వైసీపీకి అవకాశం ఇవ్వకుండా కూటమి ఐక్యతను చాటుకోవాలని కూడా జనసేన అభిప్రాయపడుతోంది.

ఉపాధి హామీ పథకంలో

అంచనాలు రూపొందించి పని కల్పించండి

డ్వామా పిడి మధుసూదన్ రావు

కోటనందూరు, ఆగస్టు 27, విశ్వం వాయిస్ న్యూస్ : వివిజి రాంజీ హామీ పథ కంలో అంచనాలు రూపొందించి పని కోరిన ప్రతి ఒక్కరికి పని కల్పించాలని డ్వామా పిడి మధుసూదన రావు ఆదేశిం చారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వి బి జి రాంజీ సిబ్బందికి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో పనులకు సంబంధించిన అంచనాలు రూపొందించాలన్నారు. ఉద్యాన శాఖ ద్వారా జీడి, మామిడి, కొబ్బరి, నిమ్మ పంటలు వేసు కొనుటకు అంచనాలు రూపొందించాలన్నారు. ప్రతి గ్రామంలో ఉపాధి పనులు జరిగేటట్టు కార్యాచరణ ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి వెంకటనారాయణ, ఏపీవో రాజగోపాల్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి పదవి ఏపీలో ఆయనకేనా ?

కేంద్ర మంత్రి వర్గ విస్తరణకు కౌంట్ డౌన్ ప్రారంభం అయింది. అతి తొందరలోనే ఈ ప్రక్రియ జరగనుంది. కేంద్ర మంత్రి వర్గ విస్తరణ గురించి గతంలో బీజేపీ పెద్దలు ఏమి అనుకున్నా కూడా ఇపుడు మాత్రం కొత్త ఆలోచనలతో ముందుకు సాగుతున్నారు. గతంలో అయితే అనుభవం ఇతరత్రా పరిగణనలోకి తీసుకునేవారు. ఇపుడు యూత్ తో కనెక్ట్ అయ్యే వారికి చాన్స్ తప్పకుండా వస్తుందని అంటున్నారు. అలాగే మిడిల్ ఏజ్ వారికి యూత్ కి ఎక్కువగా అవకాశాలు దక్కుతాయని అంటున్నారు. ఇక మోడీ కేబినెట్ లో రెండు తెలుగు రాష్ట్రాలకు ప్రాధాన్యత ఈసారి మరింతగా పెరిగే పరిస్థితి కనిపిస్తోంది అని అంటున్నారు. ఉన్న వారిని కొనసాగిస్తూ కొత్తగా మరికొందరికి అవకాశం ఇస్తారని అంటున్నారు.

ఏపీలో ఒకరికి కచ్చితంగా :

ఇక ఏపీలో ప్రస్తుతం ముగ్గురు కేంద్ర మంత్రులు ఉన్నారు. అందులో ఒకరు కేబినెట్ ర్యాంక్ అయిన కింజరాపు రామ్మోహన్ నాయుడు అయితే మరో ఇద్దరు సహాయ మంత్రులుగా ఉన్నారు. టీడీపీకి చెందిన గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ వీరిలో ఒకరు అయితే రెండవవారు నరసాపురం ఎంపీ బీజేపీకి చెందిన శ్రీనివాస వర్మ. ఇక వీరిని విస్తరణ తరువాత కూడా కొనసాగించే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయి. పెమ్మసానికి అయితే ఇండిపెండెంట్ చార్జితో ప్రమోషన్ దక్కనుంది అని అంటున్నారు. ముగ్గురు మంత్రుల శాఖలు మారవచ్చు అని అంటున్నారు. వీరితో పాటు మరో మంత్రిని కేంద్రంలో తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు. ఏపీలో టీడీపీ బీజేపీకి కేంద్ర మంత్రివర్గంలో చోటు ఉంది. లేనిది జనసేనకే అందుకే ఆ పార్టీకి ఈసారి చాన్స్ ఇస్తారని అంటున్నారు. జనసేనకు లోక్ సభలో ఇద్దరు ఎంపీలు ఉన్నారు. అలాగే రాజ్యసభలో కొత్తగా ఒకరు ఇటీవలనే నెగ్గారు.

ఆయనకే అవకాశం :

ఇక జనసేన నుంచి చూస్తే మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, కాకినాడ ఎంపీ ఉదయ శ్రీనివాస్ ఉన్నారు. రాజ్యసభ ఎంపీగా లింగమనేని రమేష్ ఉన్నారు. వీరి ముగ్గురులో బాలశౌరి సీనియర్ గా ఉన్నారు. ఆయన ఇప్పటికి మూడు సార్లు ఎంపీగా పనిచేశారు. పార్లమెంటరీ వ్యవహారాలపైన అనుభవం ఉంది. అన్ని విధాలుగా అవగాహన ఉంది. దాంతో ఆయన పేరునే జనసేన నుంచి తీసుకుంటారు అని అంటున్నారు. సరిగ్గా 2024 ఎన్నికలకు ముందు బాలశౌరి జనసేనలో చేరారు, ఆ తరువాత కూటమి ప్రభంజనంలో ఆయన గెలిచారు. ఇపుడు ఆయనకు కేంద్ర మంత్రిగా కూడా అవకాశం లభించడం ఖాయమని అని అంటున్నారు. రాజకీయ సామాజిక ప్రాంతీయ సమీకరణలు కూడా సరిపోతాయని అంటున్నారు. సో ఆయన పేరు అయితే గట్టిగా ఏపీ నుంచి వినిపిస్తోంది.

తెలంగాణాలో ఇద్దరు :

అదే విధంగా తెలంగాణా నుంచి చూస్తే ఇద్దరు పేర్లు ఖాయమని అంటున్నారు. అంటే ప్రస్తుతం ఉన్న ఇద్దరికి మరో ఇద్దరు జత అవుతారు అన్న మాట. ఆ ఇద్దరే మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ, మల్కాజ్ గిరీ ఎంపీ ఈటెల రాజేందర్ అని అంటున్నారు. డీకే అరుణ కాంగ్రెస్ లో కూడా ఉమ్మడి ఏపీలో రాష్ట్ర మంత్రిగా పనిచేశారు.మహిళా నేతగా ఆమె కీలకంగా ఉన్నారు. అలాగే బీసీ కోటాలో సీనియర్ నేత ఈటెల రాజేందర్ కి కేంద్ర మంత్రి అవకాశం దక్కుతుందని చెబుతున్నారు. ప్రస్తుతం కేబినెట్ మంత్రిగా కిషన్ రెడ్డి ఉన్నారు. అలాగే సహాయ మంత్రిగా బండి సంజయ్ ఉన్నారు. ఈ విధంగా చూసుకుంటే కేంద్ర కేబినెట్ విస్తరణ తరువాత ఏపీ నుంచి నలుగురు తెలంగాణా నుంచి నలుగురు కేంద్ర మంత్రులుగా ఉంటారు అని అంటున్నారు.

అన్నవరం క్షేత్రంలో భక్తులపై

దాడి ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలి

దేవస్థానంలో భక్తుల భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలి – విశ్వ హైందవ పరిషత్

అన్నవరం, ఆగస్టు 27, విశ్వం వాయిస్ న్యూస్ : పవిత్రమైన అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామివారి దేవస్థానం పరిసరాల్లో రాత్రి సమయంలో పెళ్లి బృందంపై కొంతమంది యువకులు దాడికి పాల్పడ్డారనే ఘటనపై విశ్వ హైందవ పరిషత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అందుతున్న సమాచారం ప్రకారం, రాత్రి సమయంలో మద్యం సేవించిన కొంతమంది యువకులు ముందుగా కారు డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగినట్లు, అనంతరం దేవస్థానానికి వచ్చిన పెళ్లి బృందంలోని భక్తులతో గొడవపడి దుర్భాషలాడుతూ దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. మహిళలతో అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు, వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన సెక్యూరిటీ సిబ్బందిపై కూడా దాడి చేసినట్లు సమాచారం. ఘటనపై దేవస్థానం సిబ్బంది పోలీసులకు సమాచారం అందించగా, ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. విశ్వ హైందవ పరిషత్ తరఫున అన్నవరం దేవస్థానం ఈఓ గారికి ఫిర్యాదు చేస్తున్నాము. ఘటనకు సంబంధించిన జజుఎ ఫుటేజీని పరిశీలించి పూర్తి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకునేలా పోలీసు అధికారులతో సమన్వయం చేయాలని కోరుతున్నాము. అన్నవరం వంటి పవిత్ర పుణ్యక్షేత్రంలో భక్తులు, ముఖ్యంగా మహిళలు, కుటుంబాలతో వచ్చే భక్తులు ఎటువంటి భయాందోళనలు లేకుండా దర్శనం చేసుకునే పరిస్థితి ఉండాలి. దేవస్థానం పరిసరాల్లో మద్యం సేవించడం, భక్తులతో గొడవలకు దిగడం, అసభ్యంగా ప్రవర్తించడం వంటి చర్యలను ఏమాత్రం సహించకూడదు.

మా ప్రధాన డిమాండ్లు:

ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలి.

జజుఎ ఫుటేజీని భద్రపరిచి దాడికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరించాలి.

బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి.

దేవస్థానం పరిసరాల్లో రాత్రివేళ భద్రతా గస్తీని పెంచాలి.

భక్తులు, మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా దేవస్థానం అధికారులు పటిష్ట భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేయాలి. పవిత్రమైన అన్నవరం క్షేత్రం భక్తులకు భద్రత, ప్రశాంతతకు ప్రతీకగా ఉండాలి. భక్తుల భద్రత విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని విశ్వ హైందవ పరిషత్ డిమాండ్ చేస్తోంది.

చంద్రబాబుతోనే సీమ సస్య శ్యామలం

2 ఏళ్లలో రాయలసీమకు హంద్రీ-నీవా ద్వారా 50 టీఎంసీలు తరలించాం - 19 నియోజక వర్గాల్లో 420కు పైగా చెరువులు నింపాం - గతంలో పులివెందులకు సాగునీరిచ్చిన చంద్రబాబు

త్వరలో 24 గంటలూ తాగునీరు కూడా ఇవ్వబోతున్నదీ ఆయనే... సీమను అభివృద్ధి చేస్తున్నది చంద్రబాబే అని ఒప్పుకున్న వైసీపీ నాయకుడు విశ్వేశ్వరరెడ్డి - 5 ఏళ్లలో రాయలసీమకు జగన్ చేసింది శూన్యం

సీమ ప్రాజెక్టులపై మాట్లాడే అర్హత వైసీపీకి లేదు : రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

పెనుకొండ/శ్రీసత్యసాయి, ఆగస్టు 27, విశ్వం వాయిస్ న్యూస్ : రాయలసీమను సీఎం చంద్రబాబునాయుడు సస్యశ్యామలం చేస్తున్నారని, ఆయన హయాంలోనే సీమ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి భారీ ఎత్తున నిధులు కేటాయించారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. రెండేళ్లలో హంద్రీ-నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) ప్రాజెక్టు ద్వారా రాయలసీమకు 50 టీఎంసీల కృష్ణా జలాలను తరలించామన్నారు. వైసీపీ పాలనలో రాయలసీమ ప్రాజెక్టులకు రూ.2,011 కోట్లే ఖర్చు చేశారని, 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం రూ.12,500 వెచ్చించిందని గుర్తుచేశారు. రాయలసీమ ప్రాజెక్టుల గురించి వైసీపీ నాయకులకు మాట్లాడే అర్హత లేదన్నారు. ఆనాడే జగన్ ను వైసీపీ నేతలు ఎందుకు నిలదీయలేదని మంత్రి సవిత ప్రశ్నించారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వాల హయాంలోనే రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు ప్రాధాన్యమిచ్చారన్నారు. అన్న ఎన్టీఆర్ తెలుగు గంట, హంద్రీ-నీవా, పోతిరెడ్డి పాడు హెడ్ రెగ్యూలేటర్ వంటి ఎన్నో ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టారన్నారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు రాయలసీమను సస్య శ్యామలం చేయడానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారన్నారు. 2014-19 మధ్య రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.12,500 కోట్లు వెచ్చించారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో రూ.6,600 వేల కోట్లకుపైగా ఖర్చు చేశారన్నారు. ఈ రెండేళ్ల కాలంలో హంద్రీ - నీవా ద్వారా రాయలసీమకు 52 టీఎంసీల నీటిని తీసుకొచ్చామన్నారు. 19 నియోజక వర్గాల్లో ఉన్న 420 చెరువులను నీటితో నింపామన్నారు. తుంగభద్ర (టీబీ) డ్యామ్ ఆధునీకీకరణ, క్రస్ట్ గేట్ల మార్పిడికి రూ.35 కోట్లు వెచ్చించామన్నారు. రూ.750 కోట్ల వ్యయంతో హంద్రీ-నీవా మడకశిర బ్రాంచ్ కెనాల్ వెడల్పు పనులకు ఎమ్మెల్యే బాలకృష్ణ చేతుల మీదుగా శ్రీకారం చుట్టామన్నారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంతో ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు ఎంతో మేలు జరుగుతుందని మంత్రి

సవిత తెలిపారు.

పులివెందులకు సాగు, తాగునీరిస్తున్న చంద్రబాబు

కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపులకు పాల్పడకుండా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకూ సాగు, తాగునీరందించడానికి తీవ్రంగా కృషి చేస్తోందని మంత్రి సవిత తెలిపారు. ముఖ్యంగా పులివెందుల నియోజక వర్గానికి 2014-19 మధ్య సీఎం చంద్రబాబునాయుడు సాగునీరందించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, పులివెందులకు తాగు నీరందించడానికి రూ.480 కోట్ల జలజీవన్ మిషన్ నిధులతో మెగా వాటర్ గ్రిడ్ నిర్మాణం చేపట్టామన్నారు. వచ్చే నెలలో ఈ నిర్మాణం పూర్తి కానుందన్నారు. ఈ వాటర్ గ్రిడ్ నిర్మాణంతో 24 గంటలూ పులివెందులకు తాగునీరు అందుతుందని తెలిపారు. పులివెందులకు సాగు, తాగు నీరు అందిస్తున్న ఘనత సీఎం చంద్రబాబుదేనని మంత్రి సవిత వెల్లడించారు.

జగన్‌ను ఎందుకు నిలదీయలేదు..?

రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల గురించి మాట్లాడే అర్హత వైసీపీ నాయకులకు లేదని మంత్రి సవిత స్పష్టంచేశారు. తన స్వార్థ రాజకీయాల గురించి తప్ప, సీమ అభివృద్ధి గురించి జగన్ ఏనాడూ పట్టించుకోలేదన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఏర్పడిన టీడీపీ ప్రభుత్వం 2014-19 మధ్య రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.12,500 కోట్లు వెచ్చించారన్నారు. తరవాత అధికారంలోకి వచ్చిన అయిదేళ్లలో రాయలసీమ ప్రాజెక్టులకు కేవలం రూ.2,011 కోట్లే ఖర్చు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో రూ.6,600 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించామన్నారు. ఇదే విషయం వైసీపీ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి సైతం ఆ పార్టీ నాయకులకు వెల్లడించారన్నారు. రాయలసీమ అభివృద్ధి గురించి జగన్ ఏనాడూ దృష్టి సారించలేదని ఆయన అన్నారన్నారు. రాయలసీమ పట్ల చూపుతున్న నిర్లక్ష్యం గురించి ఆనాడు జగన్ ను ఎందుకు నిలదీయలేదని వైసీపీ నాయకులను మంత్రి సవిత ప్రశ్నించారు.

బహిరంగ చర్చ రెడీ...

ఎల్ నినో సహా వైసీపీ లేవనెత్తిన సమస్యలపైనా అసెంబ్లీలో చర్చకు రావాలని జగన్ ను ఆహ్వానించినా ముఖం చాటేశారని మంత్రి సవిత మండిపడ్డారు. కావాల్సినంత సమయం మైక్ ఇస్తామని, వైసీపీ హయాంలో లాగా అగౌరపరచమని చెప్పినా అసెంబ్లీకి జగన్ రాలేదన్నారు. ఇప్పుడు ఎక్కడో కూర్చొని అబద్దాలు మాట్లాడడం జగన్ కే చెల్లిందన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులను స్పష్టం చేస్తున్నానని, రాయలసీమ ప్రాజెక్టులపై బహిరంగ చర్చకైనా సిద్ధంగా ఉన్నామని మంత్రి సవిత సవాల్ చేశారు.

వ్యాయామ కళాశాలతో వారికి సంబంధం లేదు

వైఎంవిఎ లిఫ్ట్ కోసం చాలా కాలం నుంచి స్థలం అడిగారు - వారాధి రమణ తప్పుడు ప్రచారంపై కందకం శ్రీను ఆగ్రహం

రాజమహేంద్రవరం, ఆగస్టు 27, విశ్వం వాయిస్ న్యూస్ : స్థానిక వైఎంవిఎ పక్కన నిర్వహిస్తున్న పోతుల వీరభద్ర రావు వ్యాయామ కళాశాల స్థలం మాదంటూ కొందరు వ్యక్తులు ప్రచారం చేసుకుంటూ తిరు గుతున్నారని వారికి ఆ వ్యాయామ కళాశాలతో ఎటువంటి సంబంధం లేదని పడాల పెద్ద వెంకటేశ్వరరావు కుమారుడు పడాల శ్రీను (కం దకం శ్రీను) వెల్లడించారు. వైఎంవిఎ లిఫ్ట నిర్మా ణానికి ఆ స్థలాన్ని తాను అమ్మేసానని, వారి వద్ద నుంచి 11 లక్షలు తీసుకున్నానని జరుగుతున్న ఆరోపణలు ఖండించారు. ప్రెస్ క్లబ్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో కందకం శ్రీను మాట్లాడుతూ ఆ వ్యాయామ కళాశాల నిర్వహణకు పూర్తి స్థాయిలో సహకరించింది తన తండ్రి పడాల పెద్ద వెంకటేశ్వరరావు అన్నారు. ఇప్పుడు ఈ స్థలం మాదని చెబుతున్న వారాధి వెంకట రమణకు వ్యాయామ కళాశాలకు ఎటువంటి సం బంధం లేదని, ఆయన బాక్సర్ కాదని, విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతూ ప్రాణాల మీదుకు తెస్తున్నారని ఆరోపించారు. దీనిపై పోలీసు లకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. వ్యాయామ కళాశాల నిర్వహిస్తున్న స్థలం మున్సిపాలిటీకి చెందినదిగా తాము భావిస్తున్నామని, మాకు ఎలా సంక్రమించిందన్నది తెలియదన్నారు. తాము ఆ కళాశాలలో మట్టి కుస్తీలో శిక్షణ పొంది జాతీయ స్థాయి పోటీల వరకు వెళ్లి మెడల్స్ సాధించామని తెలిపారు. వైఎంవిఎ లిఫ్టు నిర్మాణం చేయడానికి ఆ స్థలంలో నివాసం ఉంటున్న మహిళను ఖాళీ చేసి వెళ్లేలా ప్రత్యామ్నాయం చూడాలని ఎపిఐఐసి మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్ర హ్మణ్యం కోరారని తెలిపారు. ఆమెకు 2 లక్షల రూపాయలు ఆర్థిక భరోసా కల్పించేందుకు సహకరించారని వివరించారు. తాను ప్రతీ ఏటా నిర్వహించే శ్యామలాంబ ఉత్సవాలతో పాటు కోటగుమ్మం శివుడి విగ్రహం నిర్వహణకు శివరామ సుబ్రహ్మణ్యం సూచన మేరకు 9 లక్షల రూపాయలు విరాళంగా అందచేసారని తెలిపారు. తాను వైఎంవిఎ నుంచి డబ్బులు తీసుకున్నానని వారాధి రమణ అనే వ్యక్తి చెబుతున్న మాటలు వాస్తవం కాదన్నారు. కమిటీ అందరూ కలిసే శివరామ సుబ్రహ్మణ్యం వద్దకు వెళ్లి ఆ డబ్బును తీసుకోవడం జరిగిందని, తనకు నిజాయితీ ఉంది కాబట్టే అలా చేసానని తెలిపారు. తాను రియలెస్టేట్ వ్యాపారం చేసుకుంటున్నానని, ఎవరి వద్ద నుంచి డబ్బు తీసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసారు. వ్యాయామ కళాశాల మేమే స్థాపించామని, తమపై దుష్ప్రచారం చేస్తుండటంతో అన్ని విషయాలు వివరంగా వెల్లడించేందుకు ఈ మీడియా సమావేశం నిర్వహించామన్నారు. సమావేశంలో అడపా రాజు, కృష్ణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకార సంఘం సంక్షేమానికి

అన్ని విధాల సహకారం అందిస్తాం

రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం, ఆగస్టు 27, విశ్వం వాయిస్ న్యూస్ : స్వర్ణకార సంఘం సంక్షేమానికి అన్ని విధాల సహకారం అందిస్తామని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఇటీవల జరిగిన స్వర్ణకార సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కార్యవర్గ సభ్యులను ఈ రోజు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుని తిలక్ రోడ్డులోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్వర్ణకార సంఘం అధ్యక్షులు బ్రహ్మశ్రీ గండేబత్తుల శ్యామ్, కడియం మోహన్ కుమార్, అనుపోజు వెంకటరమణమూర్తి, దార్ల బాలమురళీకృష్ణ, గండేబత్తుల రామకృష్ణ ఎమ్మెల్యేను కలిసి తమ ఎన్నికల విజయాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు నూతనంగా ఎన్నికైన స్వర్ణకార సంఘం ప్రతినిధులను అభినందించారు. స్వర్ణకార సంఘం అభివృద్ధి, సంక్షేమం కోసం అవసరమైన ఏ సహాయ సహకారాలైనా తన వంతు పూర్తిస్థాయిలో అందిస్తానని ఎమ్మెల్యే వాసు హామీ ఇచ్చారు.

విద్యార్థులకు సైబర్ నేరాలపై

అవగాహన కార్యక్రమం

కడియం, ఆగస్టు 27, విశ్వం వాయిస్ న్యూస్ : కడియం మినర్వా ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని కడియం ఎస్సై బి.నాగ దుర్గా ప్రసాద్ గారు మరియు జిల్లా సైబర్ ల్యాబ్ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై, సైబర్ ల్యాబ్ సిబ్బంది విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వ్యక్తిగత సమాచారం,బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు వంటి అత్యంత కీలకమైన సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు.అలాగే, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయంటూ వచ్చే పెట్టుబడి ఆఫర్లు, ఆన్‌లైన్ పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో జరిగే మోసాలు, లాటరీలు, బహుమతులు, కస్టమర్ కేర్ పేరుతో వచ్చే ఫోన్ కాల్స్ వంటి మోసపూరిత ప్రయత్నాలను నమ్మవద్దని హెచ్చరించారు. త్వరగా డబ్బు సంపాదించాలని ఆశపడి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని అనేక మంది ఆర్థికంగా నష్టపోతున్నారని వివరించారు.వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమ వేదికల్లో అపరిచితులతో చాటింగ్ చేయడం, వారు పంపే లింకులు, యాప్‌లు, ఈ-మెయిల్స్‌ను క్లిక్ చేయడం వల్ల వ్యక్తిగత సమాచారం దొంగిలించబడే ప్రమాదం ఉందని విద్యార్థులకు అవగాహన కల్పించారు.సైబర్ మోసాలకు గురైన సందర్భంలో ఆలస్యం చేయకుండా వెంటనే 1930 టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సైబర్ ల్యాబ్ సిబ్బంది పి.దుర్గాప్రసాద్, అబ్దుల్ షౌకత్, స్కూల్ అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

పవర్స్ ఎయిడెడ్ పాఠశాలకు ఛాంబర్ ట్రస్ట్ వితరణ

విద్యార్థుల సులభ విద్యాభ్యాసానికి టీవీ ప్రింటర్ బహూకరణ

రాజమహేంద్రవరం, ఆగస్టు 27, విశ్వం వాయిస్ న్యూస్ : స్థానిక గౌతమి ఘాట్ రాజమండ్రి వర్తకుల స్వచ్ఛంద సేవా సంస్థ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్ తమ సేవా కార్యక్రమా లలో భాగంగా స్థానిక బైపాస్ రోడ్డులోని ఆంధ్రానగర్ లోని పవర్స్ ఎయిడెడ్ ప్రాథమికొన్నత పాఠశాల వారి అభ్యర్థన మేరకు విద్యార్థుల సులభ విద్యాభ్యాసం నిమిత్తం స్కూల్ నిమిత్తం 43 ఇంచెస్ టివి,ఒక ప్రింటర్ ను ట్రస్ట్ ఉపాధ్యక్షులు ఇయ్యపు మురళీధర్,గౌరవ కార్యదర్శి బాలనాగు బలేష్ గుప్తా,సహాయ కార్యదర్శి యలమర్తి వెంకటేశ్వరరావు(బాబు), డైరెక్టర్స్ లక్కోజు వీరభద్రరావు(లక్కోజి), మండవిల్లి వెంకట్రాజు(రాజా) తదితరుల చేతుల మీదుగా స్కూల్ హెచ్ ఎం & కరెస్పాండంట్ వ్. పద్మజ,మాస్టర్ పరస జగన్నాధంలకు అందజేశారు.

ఇళ్లకు తాళం వేసి ఊళ్లకు వెళ్లే సమయంలో

ఎల్‌హెచ్ఎంఎస్ సేవలు వినియోగించుకోండి

జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్



రాజమహేంద్రవరం, జాతీయ వార్తా ప్రపంచం, ఆగస్టు 27 : తూర్పుగోదావరి జిల్లా పోలీసు శాఖ LHMS సేవ ద్వారా ఇళ్లకు తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రజలకు ఉచిత నిఘా భద్రతను అందిస్తోంది. జిల్లా ఎస్పీ సూచనల మేరకు, ప్రజలు తమ ఇళ్ల భద్రత కోసం ఎల్.హెచ్.ఎం.ఎస్. సేవలను సద్వినియోగం చేసుకోవాలని పోలీసు శాఖ సూచిస్తోంది.యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ మరియు వినియోగ విధానం :యాప్ డౌన్‌లోడ్: Android వినియోగదారులు Google Play Store నుండి, iPhone వినియోగదారులు Apple App Store నుండి “LHMS AP POLICE” యాప్‌ను ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్: యాప్‌లో మీ పేరు, మొబైల్ నంబరు మరియు చిరునామా నమోదు చేయాలి. (ఈ రిజిస్ట్రేషన్ మీ ఇంటి వద్దనే ఉన్నప్పుడు చేస్తే, మీ ఇంటి లాంగిట్యూడ్, లాటిట్యూడ్ వివరాలు ఆటోమేటిక్‌గా పోలీసులకు అందుతాయి).

ఓటిపి వెరిఫికేషన్: మీ మొబైల్‌కు వచ్చే ఓటిపిని ఎంటర్ చేయగానే మీకు ఒక రిజిస్ట్రేషన్ నంబర్ వస్తుంది.

రిక్వెస్ట్ పంపడం: మీరు ఊరికి వెళ్లేటప్పుడు యాప్‌లోకి లాగిన్ అయి, ఏ తేదీ నుండి ఎన్ని రోజులు వెళ్తున్నారో వివరాలు నమోదు చేసి సబ్మీట్ చేయాలి.కీలక సమాచారం & హెల్ప్‌లైన్:

భద్రతా వ్యవస్థ: ఇంటి పరిసరాల్లోకి దొంగలు ప్రవేశిస్తే వెంటనే కెమెరా అలర్ట్ అయి, లైవ్ వీడియో/ఫోటోలను కంట్రోల్ రూమ్‌కు పంపుతుంది. కంట్రోల్ రూమ్‌లో సైరన్ మోగగానే నిమిషాల వ్యవధిలో పెట్రోలింగ్ సిబ్బంది అక్కడికి చేరుకుంటారు.స్మార్ట్‌ఫోన్ లేనివారికి (ఫోన్ నంబర్ల ద్వారా): ఆండ్రాయిడ్ ఫోన్ లేనివారు లేదా యాప్ ఆపరేట్ చేయడం రానివారు క్రింది నంబర్లకు ఫోన్ చేసి సేవలు పొందవచ్చు: 9493206371, 9908454580. ఈ ఎల్.హెచ్.ఎం.ఎస్. సేవ పూర్తిగా ఉచితం, కావున ప్రయాణాలకు వెళ్లే తూర్పుగోదావరి జిల్లా ప్రజలందరూ ఈ సేవను వినియోగించుకోవాలని కోరడమైనది.

విగ్రహాల ధ్వంసంపై

కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం

తక్షణం నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్

రాజమహేంద్రవరం, ఆగస్టు 27, విశ్వం వాయిస్ న్యూస్ : స్థానిక జాంపేట రైల్వే వంతెనపై ఉన్న మాజీ ప్రధాన మంత్రులు రాజీవ్ గాంధీ, ఇందిరా గాంధీ విగ్రహాలను దుండగులు ధ్వంసం చేయడంపై కాంగ్రెస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోడ వెంకట్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి పట్నాల శ్రీనివాస్, కాటం రవి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గట్టి నవ తారకేష్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు లీలావతి, చింతాడ వెంకటేశ్వరరావు, నరాల నంద కిషోర్ తదితర కాంగ్రెస్ నాయకులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మురళీకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకోగా, జరిగిన ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను కాంగ్రెస్ నాయకులు ఆయనకు వివరించారు. విగ్రహాలను ధ్వంసం చేసిన నిందితులను వెంటనే గుర్తించి అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ ఘటనపై వెంటనే చర్యలు తీసుకుంటామని సర్కిల్ ఇన్స్పెక్టర్ మురళీకృష్ణ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోడ వెంకట్ మాట్లాడుతూ విగ్రహాలను ధ్వంసం చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పోలీసులు త్వరగా తగిన చర్యలు తీసుకోకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపడతామని తెలిపారు. అనంతరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఘటనపై అధికారికంగా ఫిర్యాదు చేయడం జరిగింది.

పాత గంజాయి నేరస్తులు ఇద్దరు అరెస్టు

ఎస్సై వెంకట రమేష్ – రిమాండ్‌కి తరలింపు

కోరుకొండ, ఆగస్టు 27, విశ్వం వాయిస్ న్యూస్ : మండలంలోని నరసాపురం శివారులో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా అనుమానస్పాదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తు లను అదుపులోకి తీసుకొగా వారు 2025 సంవత్సరం నుండి గంజాయి కేసులో పోలీసుల కళ్ళు కప్పి తప్పించి తిరుగుతున్నట్లు, వారిని అరెస్టు చేసినట్లు కోరుకొండ ఎస్సై వెంకట రమేష్ తెలిపారు. గురువారం ఆయన కథనం ప్రకారం 2025 సంవత్సరం గంజాయి కేసులో నక్కా నాగేంద్ర కుమార్, మర్రి సుధీర్ల పోలీసుల కళ్ళు కప్పి తప్పించుకుని తిరుగుతున్నారన్నారు. ముందస్తు సమాచారంతో రాజమహేంద్రవరం ఎస్పీ నరసింహ కిషోర్, ఉత్తర మండల డిఎస్పి సిహెచ్ జీవన ఆదేశాల మేరకు గురువారం మధ్యాహ్నం నరసాపురం శివారులో అరెస్టు చేసి, రిమాండ్ కు తరలించామన్నారు. నక్క నాగేంద్ర కుమార్ పై రంగంపేట పోలీస్ స్టేషన్ లో 10 కేసులు, మర్రి సుధీర్ పై త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో రెండు కేసులు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకట రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు

వైభవంగా నాలుగో వార్షికోత్సవ వేడుకలు

లాజరస్, రెవరెండ్ రాయుడు రాజ్ కుమార్, రెవరెండ్ పివి రత్నం, రెవరెండ్ కల్వరి కుమార్, రెవరెండ్ సుందర్, రెవరెండ్ వై ప్రభాకర్, రాజమహేంద్రవరం రూరల్, వివిధ మండలాల దైవజనులు, సేవకులు తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండ, ఆగస్టు 27, విశ్వం వాయిస్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ నాలుగో వార్షికోత్సవ వేడుకలు దైవజనుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం మండలంలోని జంబుపట్నం బేతస్త వర్షిప్ సెంటర్ లో కోరుకొండ, రాజానగరం, సీతానగరం, రాజమండ్రి రూరల్ మండలాల దైవజనులు సేవకులు పెద్ద ఎత్తున విచ్చేసి ఏసుక్రీస్తుకు ప్రత్యేక ప్రార్థన నిర్వహించి, అసోసియేషన్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో చేపట్టవలసిన సేవా కార్యక్రమాలకు పై చర్చించారు. ఈ సందర్భంగా పలువురు దైవజనులు మాట్లాడుతూ గత నాలుగేళ్ల నుండి యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు వివిధ స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని దైవజనులు అనునిత్యం ప్రార్థనలు చేస్తున్నారన్నారు. దళితులకురాజ్యాంగబద్ధంగా సంక్రమించిన హక్కులను కాపాడుకోవడానికి దైవజనులు, సేవకులు అందరూ ఏకతాటిపై నడవాలన్నారు. భవిష్యత్తులో యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బిషప్ డాక్టర్ నక్కా ఆనంద్ కుమార్, రెవరెండ్ చిర్ర ప్రసాద్, రెవరెండ్ మట్టాడి

ఇంటర్నేషనల్ ఇక్కడ.. తగ్గేదేలా..

ఫోర్బ్స్ ఇండియా కవర్ పేజీపై అల్లు అర్జున్..

జాతీయ అవార్డు గ్రహీత, పాన్ ఇండియా స్టార్ అల్లు అర్జున్ ఖాతాలో మరో అరుదైన ఘనత చేరింది. ఫోర్బ్స్ ఇండియా తాజాగా షో స్టాపర్స్ 2026 పేరుతో 100 మంది ప్రముఖ సెలబ్రెటీల జాబితాను విడుదల చేసింది. ఈ క్రమంలోనే 2025 జనవరి నుంచి 2026 మార్చి వరకు సినిమా, ఓటీటీ, క్రీడలు, సంగీతం, టెలివిజన్ తదితర రంగాల్లో విశేష ప్రభావం చూపించిన వారిని జాబితాలో ఎంపిక చేశారు. పాన్ ఇండియా స్టార్ హీరో, నేషనల్ అవార్డ్ విన్నర్ అల్లు అర్జున్ మరో ఘనత సాధించారు. ప్రముఖ అంతర్జాతీయ మ్యాగజైన్ ఫోర్బ్స్ ఇండియా షోస్టాపర్స్ 2026 పేరుతో ప్రత్యేక సంచిక విడుదల చేసింది. ఈ సంచిక కవర్ పేజీపై బన్నీ మెరిశారు. తనదైన స్టైల్, ఆకట్టుకునే లుక్ తో కవర్ పేజీపై కనిపించారు బన్నీ. దీంతో ఈసారి జాతీయ స్థాయిలో కాదు అంతర్జాతీయ స్థాయిలో తనకున్న క్రేజ్ చాటుకున్నారు. ఈ సందర్భంగా సినీ పరిశ్రమలోని ప్రస్తుత పరిస్థితులు, సినిమాలోని కథ ప్రాముఖ్యతను ఆయన వివరించారు. "ఉత్తరాది, దక్షిణాది సినిమా లేదా మరే ఇతర ప్రాంతీయ సినిమా అయినా సరే.. బాక్సాఫీస్ వద్ద ఆదరణ పొందాలంటే కథే ప్రధానం" అని అన్నారు. మంచి కంటెంట్ ఉంటే భాషతో సంబంధం లేకుండా హిట్ అవుతుందని.. కొత్త కథను ప్రేక్షకులకు అందించడమే అన్నిటికంటే ముఖ్యమని అన్నారు అల్లు అర్జున్. ఈ సందర్భంగా సినిమాల్లోని నటీనటుల స్టార్ డమ్ కంటే కూడా సరైన కథే చిత్ర విజయాన్ని నిర్ణయిస్తుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. పుష్ప ది రైజ్, పుష్ప ది రూల్ వంటి చిత్రాలతో ఇంటర్నేషనల్ లెవల్లో సత్తా చాటారు బన్నీ. తనదైన నటనతో, మేనరిజమ్స్, డైలాగ్ డెలివరీ, డ్యాన్స్ తో ప్రాంతీయ సరిహద్దులు దాటి ప్రపంచవ్యాప్తంగా క్రేజ్ సొంతం చేసుకున్నారు. ఈ సినిమాల్లో తన నటనకుగానూ ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డ్ అందుకున్నారు. ప్రస్తుతం బన్నీ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో రాకా చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో బాలీవుడ్ బ్యూటీ దీపిక పదుకొణే కథానాయికగా నటిస్తుండగా.. ఈ మూవీపై ఇప్పటికే భారీ హైప్ నెలకొంది. ఇదిలా ఉంటే.. 20258 జనవరి నుంచి 2026 మార్చి వరకు సినిమాలు, ఓటీటీ, క్రీడలు, సంగీతం, టెలివిజన్.. ఇలా వివిధ రంగాల్లో ప్రభావం చూపిన 100 మంది తారల జాబితాను షోస్టాపర్స్ 2026 పేరుతో ఫోర్బ్స్ ఇండియా తాజాగా విడుదల చేసింది. ఇందులో ఇండస్ట్రీకి చెందిన పలువురు తారలు చోటు సంపాదించుకున్నారు. అల్లు అర్జున్, అమితాబ్ బచ్చన్, మోహన్ లాల్, రజినీకాంత్, రామ్ చరణ్, షారుఖ్ ఖాన్, అమీర్ ఖాన్, అక్షయ్ కుమార్, ఏఆర్ రెహమాన్, దుల్కర్ సల్మాన్, మాధవన్ , రిషబ్ శెట్టి, కళ్యాణి ప్రియదర్శన్ వంటి నటీనటులు ఇందులో ఉన్నారు.

నయనతార, టాక్సిక్ డైరెక్టర్ కలిసి

నటించిన సినిమా ఏంటో తెలుసా..



భారతీయ చలనచిత్ర పరిశ్రమలో విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న హీరోయిన్ నయనతార. జవాన్ సినిమాతో పాన్ ఇండియా లెవల్లో క్రేజ్ సొంతం చేసుకున్న ఈ అమ్మడు.. ఇప్పుడు యశ్ నటించిన టాక్సిక్ సినిమాతో మరోసారి ప్రేక్షకులను మెప్పించింది. అయితే నయనతార ఇప్పటికే దర్శకురాలు గీతూ మోహన్‌దాస్‌తో ఒక చిత్రంలో పనిచేశారు. ఆ సినిమా గురించి ఇటీవల టాక్సిక్ ప్రమోషన్లలో ప్రస్తావించారు నయనతార. లేడీ సూపర్ స్టార్ నయనతార క్రేజ్ గురించి చెప్పక్కర్లేదు. తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషలలో స్టార్ హీరోలతో వరుస సినిమాల్లో నటించి తనకంటూ ప్రత్యేక ఇమేజ్ క్రియేట్ చేసుకుంది. దాదాపు రెండు దశాబ్దాలుగా సినీరంగంలో చక్రం తిప్పుతుంది. హరి దర్శకత్వం వహించిన 2005 చిత్రం 'అయ్యా'తో నయనతార తమిళ చిత్రసీమలో కథానాయికగా అరంగేట్రం చేసిన ఈ ముద్దుగుమ్మ.. మొదటి సినిమాతోనే నటిగా ప్రశంసలు అందుకుంది. ఒక మలయాళ టెలివిజన్ ఛానల్‌లో ప్రజెంటర్‌గా తన సినీ జీవితాన్ని ప్రారంభించి, ఇప్పుడు పాన్ ఇండియా లెవల్లో దూసుకుపోతున్నారు. 2026లో విడుదలైన 'టాక్సిక్' ఒక భారీ చిత్రం, ఇందులో నయనతార ప్రధాన పాత్రలో నటించారు. ఈ చిత్రానికి మహిళా దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహించారు. అయితే గతంలో గీతూ మోహన్ దాస్ కథానాయికగా అనేక చిత్రాల్లో నటించారు. తెలుగుతోపాటు మలయాళంలో పలు సినిమాల్లో మెప్పించారు. అయితే నయనతార, గీతూ మోహన్‌దాస్ కలిసి నటించిన చిత్రం ఏంటో మీకు తెలుసా? నయనతార, దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ 2005లో విడుదలైన మలయాళ చిత్రం 'రప్పగల్'లో కలిసి పనిచేశారు. ఈ చిత్రంలో మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి కథానాయకుడిగా నటించడం గమనార్హం. అప్పట్లో వీరిద్దరు కలిసి నటించిన సినిమా సూపర్ హిట్ అయ్యింది. చాలా కాలంపాటు సినిమాలకు దూరంగా ఉన్న గీతూ మోహన్ దాస్. ఇప్పుడు దర్శకురాలిగా మారారు. భారీ అంచనాల మధ్య విడుదలైన టాక్సిక్ సినిమాకు మిశ్రమ స్పందన వస్తుంది. ఇందులో కియారా అద్వానీ, నయనతార, రుక్మిణి వసంత్, తారా సుతారియా, హుమా ఖురేషీ కీలకపాత్రలు పోషించారు.

నా ఆత్మీయ మిత్రుడి మరణం దిగ్భ్రాంతి కలిగించింది..

నటుడు జీవీ నారాయణకు మెగాస్టార్ చిరంజీవి నివాళి

ప్రముఖ సీనియర్ నటుడు, నిర్మాత జీవీ నారాయణ రావు (73) కన్నుమూసిన సంగతి తెలిసిందే. గత కొన్నాళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన బుధవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. దీంతో పలువురు ప్రముఖులు ఈ టాలీవుడ్ నటుడి మృతికి నివాళులు అర్పిస్తున్నారు. టాలీవుడ్ ప్రముఖ నటుడు, నిర్మాత జీవీ నారాయణ రావు మరణం పట్ల ఆయన మిత్రుడు, హీరో చిరంజీవి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఒక పోస్ట్ పెట్టారు మెగాస్టార్. జీవీ నారాయణ రావుతో కలిసున్న ఫొటోను షేర్ చేస్తూ.. 'ప్రముఖ సీనియర్ నటుడు, నిర్మాత, నా ఆత్మీయ మిత్రుడు జీవీ నారాయణరావు గారు ఇక లేరనే వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. 1976లో 'అంతులేని కథ' చిత్రంతో వెండితెరకు పరిచయమైన ఆయన, ఎన్నో చిత్రాల్లోనూ, పలు టెలివిజన్ సీరియళ్లలోనూ తన విలక్షణమైన నటనతో ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. నారాయణరావు గారితో నాకు ఎంతో సన్నిహితమైన అనుబంధం ఉంది. 'దేవాంతకుడు', 'యముడికి మొగుడు' వంటి చిత్రాలను నాతో నిర్మించిన నిర్మాతగా మా ప్రయాణంలో ఎన్నో మధురమైన జ్ఞాపకాలు ఉన్నాయి. 'ఓం శాంతి' అని చిరంజీవి రాసుకొచ్చారు. జీవీ నారాయణ రావు విషయానికి వస్తే.. కృష్ణా జిల్లా, కురుమద్దాలి ఆయన స్వగ్రామం. దాదాపు 100కు సినిమాలలో నటించారు. ముత్యాల పల్లకి', 'అంగడి బొమ్మ', 'చిలకమ్మ చెప్పింది', 'గ్యాంగ్ లీడర్', హిట్లర్ తదితర సినిమాలు నారాయణ రావుకు మంచి గుర్తింపు తీసుకొచ్చాయి. కేవలం నటుడిగానే కాకుండా దేవాంతకుడు, ఇంటికో రుద్రమ్మ, యముడికి మొగుడు, పెళ్ళి నీకు శుభం నాకు వంటి సినిమాలను కూడా నిర్మించారీ సీనియర్ నటుడు. నారాయణరావుకు ఒక కుమారుడు, కుమార్తె. ప్రస్తుతం ఇద్దరూ విదేశాల్లో ఉంటున్నారు. వీరు రేపు ఉదయం కల్లా హైదరాబాద్ కు చేరుకోనున్నారు. ఆ తర్వాతే నారాయణ రావు అంత్యక్రియలు జరగనున్నాయి.

మేం చేయాల్సింది చేశాం ?.. కొలంబో టెస్ట్‌పై నోరు విప్పిన టీమిండియా కెప్టెన్

శ్రీలంకతో కొలంబో టెస్టు డ్రాగా ముగియడంపై టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ స్పందించాడు. లంక బ్యాటర్ల పోరాటాన్ని ప్రశంసించిన గిల్, ఫాలోఆన్ నిర్ణయాన్ని సమర్థించుకున్నాడు. యువ స్పిన్నర్ మానవ్ సుతార్‌పై ప్రత్యేక ప్రశంసలు కురిపించాడు. డబ్ల్యూటీసీ 2027 ఫైనల్ బెర్త్‌పై భారత్ ధీమాగా ఉందని, రాబోయే సిరీస్‌లలో మెరుగైన ప్రదర్శన చేస్తామని తెలిపాడు. శ్రీలంకతో కొలంబో వేదికగా జరిగిన రెండో టెస్టులో విజయం సాధిస్తుందనుకున్న టీమిండియా మ్యాచ్‌ను డ్రాగా ముగించాల్సి వచ్చింది. ఆఖరి రోజు లంక దిగువ వరుస బ్యాటర్లు విరోచితంగా పోరాడటంతో భారత్ గెలుపు ఆశలు అడియాసలయ్యాయి. ఈ నిరాశాజనకమైన డ్రా తర్వాత టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మ్యాచ్‌లోని కీలక పరిణామాలపై స్పందించాడు. కొలంబో టెస్టు ఐదో రోజు ఉదయం ఆట ప్రారంభమయ్యే సమయానికి శ్రీలంక వద్ద కేవలం 16 పరుగుల స్వల్ప ఆధిక్యం మాత్రమే ఉండింది. చేతిలో 4 వికెట్లు ఉండటంతో భారత బౌలర్లు త్వరగానే లంక ఇన్నింగ్స్‌ను ముగిస్తారని అంతా భావించారు. అయితే సోనల్ దినుష, కేశర నువంత అద్భుతమైన పట్టుదలతో ఆడి తొలి సెషన్‌లో ఒక్క వికెట్ కూడా పడకుండా అడ్డుకున్నారు. మ్యాచ్ ముగిసిన తర్వాత ప్రెజెంటేషన్ కార్యక్రమంలో గిల్ మాట్లాడుతూ, "నిజం చెప్పాలంటే ఈ మ్యాచ్‌లో మేము వేరే ఏదీ చేయలేకపోయాం. మూడు రోజుల పాటు మైదానంలో నిరంతరం ఫీల్డింగ్ చేస్తూ

బౌలర్లు శాయశక్తులా ప్రయత్నించారు. శ్రీలంక బ్యాటర్లు ఒత్తిడిలో అద్భుతమైన నైపుణ్యం చూపి ఆడి మ్యాచ్‌ను కాపాడుకున్నారు, వారికి కాస్త అదృష్టం కూడా తోడైంది" అని పేర్కొన్నాడు.

మానవ్ సుతార్‌పై ప్రశంసల వర్షం

సిరీస్ ఫలితం అనుకూలంగా రాకపోయినా జట్టులోని సానుకూల అంశాలను గిల్ కొనియాడాడు. ముఖ్యంగా యువ స్పిన్నర్ మానవ్ సుతార్ బౌలింగ్ శైలిపై కెప్టెన్ ప్రత్యేక ముచ్చటపడ్డాడు. "ఈ సిరీస్ లో దేవదత్ పడిక్కల్, కేఎల్ రాహుల్?తో పాటు మానవ్ సుతార్ ఎంతో అద్భుతంగా ఆడాడు. మానవ్ బౌలింగ్ వేసే విధానం, ఆయన వేళ్ల నుంచి బంతి విడుదలయ్యే తీరు నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. నిలకడగా బౌలింగ్ చేస్తూ వికెట్లు తీసే మానవ్ రాబోయే కాలంలో టీమిండియాకు అత్యంత కీలకమైన బౌలర్‌గా మారతాడు. వేగవంతమైన బౌలర్లు కూడా తమ పంతు కృషి చేశారు" అని గిల్ వెల్లడించాడు.

ఫాలోఆన్ నిర్ణయాన్ని సమర్థించుకున్న కెప్టెన్

తొలి ఇన్నింగ్స్‌లో 213 పరుగుల భారీ ఆధిక్యం లభించిన తర్వాత శ్రీలంకకు ఫాలోఆన్ ఇవ్వడంపై వస్తున్న విమర్శలను గిల్ కొట్టిపారేశాడు. మైదానంలో ఆ క్షణంలో ఏది సరైన నిర్ణయమనిపిస్తే దాన్నే తీసుకుంటామని చెప్పాడు. "మ్యాచ్ ముగిసిన తర్వాత గత నిర్ణయాల గురించి మాట్లాడటం చాలా సులువు. అయితే ఆ సమయంలో పరిస్థితులకు తగినట్లుగానే మేము ఫాలోఆన్ నిర్ణయం తీసుకున్నాం. కొన్ని విషయాలు మన నియంత్రణలో ఉండవు. ఏది ఏమైనా కొలంబోలో ఒక మంచి మ్యాచ్ జరిగింది, చివరికి టెస్ట్ క్రికెట్ గెలిచింది" అని వివరణ ఇచ్చాడు.

డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్‌పై చెరగని ధీమా

కొలంబో టెస్ట్ డ్రా కావడంతో డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో భారత్ విన్నింగ్ పర్సంటేజ్ 51.51 శాతానికి పడిపోయింది. దీనిపై ప్రశ్నించగా గిల్ ఏమాత్రం ఆందోళన చెందలేదు. రాబోయే న్యూజిలాండ్ పర్యటన, ఆ తర్వాత స్వదేశంలో జరిగే సిరీస్‌లలో మెరుగైన ప్రదర్శన చేస్తామని చెప్పాడు. నిలకడైన ఆటతీరును కొనసాగిస్తూ డబ్ల్యూటీసీ 2027 ఫైనల్‌కు కచ్చితంగా అర్హత సాధిస్తామని ధీమా వ్యక్తం చేశాడు.

చరిత్రను తిరగరాసిన శ్రీలంక బ్యాటర్.. ఒకే టెస్టులో 3 చారిత్రాత్మక రికార్డులు

భారత్‌తో కొలంబో టెస్టులో శ్రీలంక యువ బ్యాటర్ సోనల్ దినుష చరిత్ర సృష్టించాడు. ఒకే టెస్టు రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ శతకాలు సాధించి అరుదైన ఘనత అందుకున్నాడు. రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో మూడు సెంచరీలు చేసిన ప్రపంచంలోని ఎనిమిదో బ్యాటర్‌గా నిలిచాడు. భారత్‌పై ఈ ఫీట్ సాధించిన మూడో శ్రీలంక ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. భారత్‌తో కొలంబో వేదికగా జరిగిన రెండో టెస్టు మ్యాచ్‌లో శ్రీలంక యువ బ్యాటర్ సోనల్ దినుష అద్భుతమైన ఇన్నింగ్స్‌తో చరిత్ర సృష్టించాడు. ఫాలోఆన్ ఒత్తిడిలోనూ చెక్కుచెదరని ఆత్మవిశ్వాసంతో ఆడి, ఒకే టెస్టు రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సెంచరీలు బాది శ్రీలంకను ఓటమి నుంచి కాపాడాడు. ఈ చారిత్రాత్మక శతకంతో ఆయన క్రికెట్ ప్రపంచంలో 3 అరుదైన రికార్డులను తన పేరిట లిఖించుకున్నాడు. భారత్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో సోనల్ దినుష ప్రదర్శన అద్భుతమనే చెప్పాలి. గాలే వేదికగా జరిగిన మొదటి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లోనే 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 100 పరుగులు సాధించి తన తొలి అంతర్జాతీయ టెస్టు సెంచరీని నమోదు చేశాడు. ఆ మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లోనూ 84 పరుగులతో రాణించి జట్టు కోసం తీవ్రంగా పోరాడాడు. ఇక కొలంబోలో జరిగిన రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 103 పరుగులు చేసిన దినుష, ఫాలోఆన్ ఆడుతూ రెండో ఇన్నింగ్స్‌లోనూ 133 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఈ అద్భుతమైన ఆటతీరుతో ఆయన సాధించిన 3 ప్రధాన రికార్డులు క్రీడాభిమానులను ఆశ్చర్యపరుస్తున్నాయి.

భారత్‌పై ఒకే టెస్టు రెండు ఇన్నింగ్స్‌ల్లో సెంచరీలు బాదిన ఆటగాడు

భారత్‌పై ఒకే టెస్టు మ్యాచ్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సెంచరీలు సాధించిన శ్రీలంక బ్యాటర్లలో సోనల్ దినుష మూడో ఆటగాడిగా నిలిచాడు. ఆయన కంటే ముందు 1982లో చెన్నై టెస్టులో దలీప్ మెండిస్ (105, 105) రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ శతకాలు బాదాడు. ఆ తర్వాత 1997లో కొలంబోలోని ఇదే ఎస్ఎస్‌సి మైదానంలో అరవింద డిసిల్వా (146, 120) ఈ ఘనత సాధించాడు. దాదాపు 29 ఏళ్ళ తర్వాత మళ్ళీ భారత్‌పై ఈ అరుదైన మైలురాయిని చేరుకున్న శ్రీలంక ఆటగాడిగా దినుష నిలిచాడు.

ఒకే టెస్టు రెండు ఇన్నింగ్స్‌ల్లో సెంచరీలు కొట్టిన 8వ శ్రీలంక దిగ్గజం

అంతర్జాతీయ టెస్టు క్రికెట్‌లో శ్రీలంక తరఫున ఒకే మ్యాచ్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సెంచరీలు సాధించిన 8వ బ్యాటర్‌గా సోనల్ దినుష చరిత్రకెక్కాడు. గతంలో అరవింద డిసిల్వా (రెండు సార్లు), కుమార్ సంగక్కర (రెండు సార్లు), దలీప్ మెండిస్, అసెంక గురుసింహ, తిలకరత్నే దిల్షాన్, ధనంజయ డిసిల్వా, కమిందు మెండిస్ మాత్రమే ఈ అరుదైన ఫీట్ సాధించారు. ఇప్పుడు వీరి సరసన 2026లో దినుష కూడా చేరి శ్రీలంక క్రికెట్ చరిత్రలో తన పేరును సువర్ణాక్షరాలతో లిఖించుకున్నాడు.

రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో 3 సెంచరీలు బాదిన ప్రపంచంలోనే 8వ బ్యాటర్

కేవలం రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లోనే 3 సెంచరీలు సాధించడం సాధారణ విషయం కాదు. ప్రపంచ క్రికెట్ చరిత్రలోనే రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో 3 సెంచరీలు కొట్టిన 8వ బ్యాటర్‌గా దినుష నిలిచాడు. లంక దిగ్గజం అరవింద డిసిల్వా గతంలో 1997లో పాకిస్తాన్‌పై, భారత్‌పై రెండుసార్లు ఈ ఘనత సాధించాడు. ఆ తర్వాత జాక్ కల్లిస్ (2007), హషీమ్ ఆమ్లా (2010), కుమార్ సంగక్కర (2013), యూనిస్ ఖాన్ (2014), మార్నస్ లబుషేన్ (2022), కేన్ విలియమ్సన్ (2024) ఈ రికార్డును నెలకొల్పగా, ఇప్పుడు సోనల్ దినుష (2026) వారి సరసన నిలిచాడు.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com